www.flashindianews.com

FLASH INDIA NEWS
ప్రతిక్షణం.. ప్రజలకోసం...

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

**విలేకరులు కావలెను**

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు,నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక : 157 | శనివారం 25.07.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-


# పేపర్ లీక్ చేస్తే దబిడిదిబిడే..

## పదేళ్ల జైలు, రూ.10 కోట్ల జరిమానా..

- పేపర్ లీక్‌లపై సవరించిన బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం
- దోషులకు 10 ఏళ్ల జైలు, రూ.10 కోట్ల జరిమానా ప్రతిపాదన
- పేపర్ లీక్ కేసుల కోసం ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు
- మూడు నెలల్లో విచారణ పూర్తి చేసేలా నిబంధనలు
- సీజేపీ మూడు డిమాండ్లు కేంద్రం ముందుకు
- విద్యార్థుల కేసుల ఉపసంహరణకు కేంద్రం సానుకూలం
- బాధిత కుటుంబాలకు పరిహారంపై కేంద్రం స్పందన
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపైనే సస్పెన్స్
- నీట్ నిరసనలపై కేంద్రం-సీజేపీ చర్చలు
- ఆందోళనల మధ్య కేంద్రం కీలక సంకేతాలు

05





## కీలక రైలు మార్గానికి గ్రీన్‌సిగ్నల్..

46 కిలోమీటర్ల మేర రైల్వే విస్తరణ
ప్రతి పార్కుకు రూ.1,000 కోట్ల కేంద్ర సాయం
ఉపాధి అవకాశాలు.. 'వికసిత్ భారత్ 2047'కు ఊతం

03


## స్పష్టం చేసిన కేంద్రం..!

### ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయరు..

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే అవకాశం లేదని ప్రభుత్వ వర్గాల స్పష్టీకరణ
మంత్రి మార్పు కంటే పరీక్షల వ్యవస్థ సంస్కరణలపైనే కేంద్రం దృష్టి
ఎన్‌టీఏలో లోపాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేస్తున్న ప్రభుత్వం
రాజీనామా కాదు.. వ్యవస్థలో సంస్కరణలే లక్ష్యం

05





# రాజీనామాకే పట్టు!

**ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేస్తేనే ఆందోళన విరమిస్తాం..**

## నేడు మరోసారి సీజేపీతో చర్చలు

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయించాలి: అభిజీత్ దీప్కే
- మంత్రి రాజీనామా చేయకపోతే మోదీనే రాజీనామా చేయాలి
- నీట్ ఉద్యమం మరింత ఉధృతం కానుందా?
- కేంద్రం-సీజేపీ మధ్య ప్రతిష్టంభన కొనసాగుతోంది
- విద్యార్థుల డిమాండ్లపై దేశవ్యాప్తంగా ఉత్కంఠ
- విద్యార్థుల కేసులపై కేంద్రం సానుకూల స్పందన
- ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం డిమాండ్

02

సీజేపీతో చర్చలు ముగిసిన అనంతరం బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్రమంత్రి జేపీ నడ్డా మీడియాతో మాట్లాడారు. సీజేపీ - కేంద్రం మధ్య రేపు మరో విడత చర్చలు జరుగుతాయని తెలిపారు. కొన్ని డిమాండ్లపై చర్చించి నిర్ణయం తీసుకునేందుకు రేపటిదాకా సమయం తీసుకున్నామని వెల్లడించారు. విద్యార్థులు మూడు డిమాండ్లను తమ ముందు ఉంచారని, వాటిపై కీలకంగా చర్చించాల్సి ఉందని తెలిపారు.

## కేంద్రానికి ఎదురుదెబ్బ

ఇంటర్నెట్ నిలిపివేత ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలి

05




# ఇది భయపడే జనరేషన్ కాదు..

## మేక్ ఇన్ ఇండియా కాదు.. లీక్ ఇన్ ఇండియా

**యువత శక్తిని తక్కువ అంచనా వేయొద్దు**

- నీట్ పేపర్ లీక్‌పై బీఆర్ఎస్ భారీ నిరసన
- ఇందిరాపార్క్‌లో విద్యార్థులతో కేటీఆర్ ధర్నా
- జన్మదిన వేడుకలు రద్దు చేసి నిరసనలో కేటీఆర్
- ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి: కేటీఆర్
- విద్యార్థులపై పోలీసుల దాడులు అమానుషం

03




**ఉపాధికి దగ్గరగా.. పేదలకు సొంతింటి భరోసా**

# జనావాసాల పరిధిలోనే...

## ప్రభుత్వం భారీ హౌసింగ్ ప్లాన్



- క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లపై సీఎం సమీక్ష
- ఔటర్ రింగ్ రోడ్ లోపల ఖాళీ భూముల గుర్తింపు
- పని ప్రదేశాలకు దగ్గరగా ఇందిరమ్మ ఇండ్లు
- నిరుపయోగ స్థలాలను వినియోగించాలి: సీఎం ఆదేశం
- నిరుపేదలకు ఉపాధి దెబ్బతినకుండా ఇండ్ల నిర్మాణం
- 17 నియోజకవర్గాల్లో తొలి దశలో 7,680 ప్లాట్లు
- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలి
- ఒక్కో ఇంటికి ₹11 లక్షల వ్యయం
- ఇందిరమ్మ ఇళ్లకు ₹5 లక్షల ప్రభుత్వ సబ్సిడీ
- భూమి ఖర్చు పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుంది

02

**హైదరాబాద్‌లో 7,680 ఇందిరమ్మ ఫ్లాట్లు**

**ఖాళీ ప్రభుత్వ భూములపై భారీ గృహ నిర్మాణం**



# ఢిల్లీలో అల్లర్లకు కమ్యూనిస్టులే కారణం

## 480 పాక్ సోషల్ మీడియా ఖాతాలు బ్లాక్

- ఢిల్లీ నిరసనల వెనుక అరాచక శక్తులు
- విద్యార్థుల ముసుగులో కమ్యూనిస్టుల కుట్ర
- పార్లమెంట్‌పై దాడి కుట్ర జరిగిందన్న బండి
- దేశ వ్యతిరేక నినాదాలు చేశారన్న కేంద్ర మంత్రి
- మహిళా జర్నలిస్టులపై దాడులను ఖండించిన బండి
- ఢిల్లీ హింసపై కేంద్ర మంత్రి సంచలన ఆరోపణలు
- శాంతి భద్రతల కోసం పోలీసులు సంయమనం పాటించారు
- విద్యార్థుల ఆందోళనను కేంద్రం అర్థం చేసుకుంది
- ధర్మేంద్ర ప్రధాన్ ఇప్పటికే క్షమాపణ చెప్పారు

02

**విద్యార్థుల ముసుగులో అరాచక శక్తులు..**

**పార్లమెంట్ టార్గెట్‌గా కుట్ర జరిగిందా?**

# అసలు రిట్ పిటిషనే దాఖలు కాలేదు

**లేఖను పిటిషన్‌గా ఎలా పరిగణిస్తాం?**



- విద్యార్థుల నిరసనల కేసుపై సీజేఐ కీలక వ్యాఖ్యలు
- పిటిషన్ విచారణ నిరాకరణ వార్తలు అబద్ధం
- సుప్రీంకోర్టులో ఎలాంటి రిట్ పిటిషన్ దాఖలు కాలేదు
- కేవలం లేఖ మాత్రమే వచ్చింది
- మీడియా తప్పుడు ప్రచారం చేస్తోంది
- వీడియోలు చూసే సమయం మాకు లేదు
- 'మా సమయాన్ని వృథా చేయకండి'
- 'పిటిషన్ లేకుండా విచారణ ఎలా?'

02

# పదేళ్ల రోడ్‌మ్యాప్ సిద్ధం చేయాలి




- గ్రీన్ ఎనర్జీ రంగంలోకి సింగరేణి అడుగులు
- బొగ్గు తవ్వకాలకే పరిమితం కావొద్దు: భట్టి
- సింగరేణిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తాం
- సింగరేణి అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి అండ
- భవిష్యత్ అవసరాలకు సింగరేణి సిద్ధం కావాలి
- గ్రీన్ హైడ్రోజన్, లిథియంపై భట్టి ఫోకస్
- క్రిటికల్ మినరల్స్ రంగంలోకి సింగరేణి
- సింగరేణికి ప్రత్యామ్నాయ వ్యాపారాలపై దృష్టి

03

## 4 డిమాండ్లలో రెండింటికి
# కేంద్రం అంగీకారం..

**న్యూ ఢిల్లీ :** నీట్–యూజీ 2026 ప్రశ్నాపత్రం లీక్ వివాదంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని కాక్రోచ్ జనతా పార్టీ (CJP) మరోసారి స్పష్టం చేసింది. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు అభిజీత్ దిప్కే మాట్లాడుతూ, ధర్మేంద్ర ప్రధాన్ పదవికి రాజీనామా చేసే వరకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కొనసాగుతున్న నిరసనలను విరమించబోమని ప్రకటించారు. అయితే, 26 రోజుల పాటు నిరాహార దీక్ష చేసిన సామాజిక కార్యకర్త సోనం వాంగ్‌చుక్ దీక్ష విరమించడం సంతోషకరమని అభిజీత్ దిప్కే అన్నారు. దేశానికి వాంగ్‌చుక్ జీవితం ఎంతో విలువైనదని పేర్కొంటూ, ఆయన దీక్ష ముగిసినా ఉద్యమం మాత్రం ఆగదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులతో తటస్థ వేదికలో చర్చలు జరగనున్నాయని దిప్కే వెల్లడించారు. చర్చలు సానుకూలంగా సాగినా, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అంశంలో ఎలాంటి రాజీ ఉండదని ఆయన స్పష్టం చేశారు. “ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తప్ప మరో పరిష్కారం మాకు ఆమోదయోగ్యం కాదు” అని దిప్కే స్పష్టంచేశారు. అయితే తమ నాలుగు ప్రధాన డిమాండ్లలో రెండింటికి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే సానుకూలంగా స్పందించిందని ఆయన తెలిపారు. జంతర్ మంతర్‌లో జరిగిన నిరసనల్లో పాల్గొన్న CJP కార్యకర్తలపై ఎలాంటి కేసులు నమోదు చేయబోమని కేంద్రం హామీ ఇచ్చిందని చెప్పారు. అలాగే, నీట్–యూజీ 2026 పేపర్ లీక్ ఘటనతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం అందించేందుకు కూడా కేంద్రం అంగీకరించినట్లు పేర్కొన్నారు. మరోవైపు, దేశవ్యాప్తంగా శాంతియుత నిరసనలు కొనసాగించాలని CJP పిలుపునిచ్చింది. విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు కలిసి చట్టబద్ధమైన అనుమతులతో నిరసనలు నిర్వహించాలని కోరింది. విద్యార్థుల డిమాండ్లను ప్రజల ముందుకు తీసుకెళ్లాలని పార్టీ నాయకత్వం సూచించింది. అభిజీత్ దిప్కే వ్యాఖ్యలతో కేంద్రంతో జరగనున్న చర్చలపై ఆసక్తి నెలకొంది. అయితే ప్రధాన డిమాండ్ అయిన ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా నెరవేరే వరకు జంతర్ మంతర్‌లోని తమ ఆందోళనను కొనసాగిస్తామని CJP తేల్చిచెప్పింది.



## ఢిల్లీలో అల్లర్లకు కమ్యూనిస్టులే కారణం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** నీట్ పేపర్ లీక్ వ్యవహారం, ఢిల్లీలో ఇటీవల జరిగిన ఆందోళనలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో స్పందించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. విద్యార్థుల పక్షాన కేంద్రం తీసుకుంటున్న చర్యలను వివరిస్తూనే, ఆందోళనల వెనుక ఉన్న అరాచక శక్తుల కుట్రలను ఎండగట్టారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారం లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు, వారి తల్లిదండ్రుల భావోద్వేగాలతో ముడిపడి ఉందని బండి సంజయ్ పేర్కొన్నారు. ఈ ఘటనపై అందరికంటే ఎక్కువగా ప్రధాని నరేంద్ర మోడీ బాధపడుతున్నారని ఆయన వెల్లడించారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేశామని, సీబీఐ ఇప్పటికే 11 మంది ఫ్యాకల్టీ సహా 17 మందిని అరెస్ట్ చేసిందని తెలిపారు. విద్యార్థుల ఆందోళనను కేంద్రం అర్థం చేసుకుందని, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ క్షమాపణలు చెప్పారని గుర్తుచేశారు. విద్యార్థుల విద్యా సంవత్సరం నష్టపోకుండా ఉండేందుకు కేవలం 40 రోజుల్లోనే మళ్లీ పరీక్షలు నిర్వహించి ఫలితాలు ప్రకటించినట్లు స్పష్టం చేశారు.

**విద్యార్థుల ముసుగులో అరాచక శక్తులు..**

మొన్న ఢిల్లీలో జరిగిన ఆందోళనల్లో విద్యార్థుల ముసుగులో కమ్యూనిస్టు శక్తులు అరాచకాలకు సృష్టించాయని మంత్రి మండిపడ్డారు. ఈ శక్తులు ఏకంగా పార్లమెంట్‌పై దాడి చేసేందుకు కుట్ర చేశాయని, అందులో భాగంగానే దేశ వ్యతిరేక నినాదాలు చేశాయని ఆరోపించారు. పోలీసులు, జర్నలిస్టులు, ముఖ్యంగా మహిళా జర్నలిస్టులపై దాడులు చేస్తూ అసభ్యంగా ప్రవర్తించారన్నారు. ఈ దాడుల్లో 118 మంది పోలీసులకు తీవ్ర గాయాలై తలలు పగిలినా పోలీసులు సంయమనం పాటించి ఎక్కడా ఫైరింగ్ చేయలేదన్నారు. విధిలేని పరిస్థితుల్లోనే అరాచక శక్తులపై తప్పనిసరి లాఠీఛార్జ్ చేయాల్సి వచ్చిందని వివరించారు. ఢిల్లీ ఉద్రిక్తతల వెనుక విదేశీ కుట్ర ఉందని బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ నుంచి సోషల్ మీడియా ద్వారా విష ప్రచారం చేస్తూ దేశంలో ఉద్రిక్తతలు సృష్టిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ పరిణామాలను తీవ్రంగా పరిగణించిన కేంద్ర ప్రభుత్వం.. పాకిస్థాన్‌కు చెందిన 480 సోషల్ మీడియా అకౌంట్లను వెంటనే బ్లాక్ చేసిందని బండి సంజయ్ వెల్లడించారు.

# రాజీనామాకే పట్టు!

**న్యూ ఢిల్లీ :** కేంద్రం – సీజేపీ మధ్య రెండో విడత చర్చల్లో సీజేపీ ప్రతినిధులు కేంద్రం ముందు మూడు కీలక డిమాండ్లను ఉంచారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కు సీజేపీ పట్టుపడుతోంది. నీట్ పేపర్ లీక్ కారణంగా ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు కేంద్రం రూ.కోటి పరిహారం ఇవ్వాలని, ఆందోళన చేస్తున్న విద్యార్థులపై ఎలాంటి ఎఫ్ఐఆర్ లు నమోదు చేయవద్దని సీజేపీ డిమాండ్ చేసింది. సీజేపీ డిమాండ్లలో కేంద్రం రెండు డిమాండ్లు నెరవేర్చేందుకు సానుకూలంగా స్పందించింది. ధర్మేంద్రప్రధాన్ రాజీనామా మినహా మిగతా రెండు డిమాండ్లను నెరవేర్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై నిర్ణయం చెప్పేందుకు మరింత సమయం కావాలని కేంద్రం .. సీజేపీ ప్రతినిధులకు తెలిపింది.

**రేపు మరో విడత చర్చలు**

సీజేపీతో చర్చలు ముగిసిన అనంతరం బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్రమంత్రి జేపీ నడ్డా మీడియాతో మాట్లాడారు. సీజేపీ – కేంద్రం మధ్య రేపు మరో విడత చర్చలు జరుగుతాయని తెలిపారు. కొన్ని డిమాండ్లపై చర్చించి నిర్ణయం తీసుకునేందుకు రేపటిదాకా సమయం తీసుకున్నామని వెల్లడించారు. విద్యార్థులు మూడు డిమాండ్లను తమ ముందు ఉంచారని, వాటిపై కీలకంగా చర్చించాల్సి ఉందని తెలిపారు.

**ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేసి తీరాల్సిందే..**

మరోవైపు సీజేపీ ప్రతినిధులు మాట్లాడుతూ.. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై వెనక్కి తగ్గేదే లేదని కేంద్రానికి స్పష్టంగా చెప్పామన్నారు. తమ డిమాండ్లపై శనివారం మధ్యాహ్నం లోగా చర్యలు తీసుకోవాలని, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకూ ఉద్యమం ఆగదన్నారు. ఆయన రాజీనామా చేయకుంటే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ తో రాజీనామా చేయించే బాధ్యత ప్రధాని నరేంద్రమోదీదే అని సీజేపీ వ్యవస్థాపక అధ్యక్షుడు అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. ఆయనతో రాజీనామా చేయించలేని పక్షంలో.. మోదీనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తామని కుండబద్దలు కొట్టారు.

# జనావాసాల పరిధిలోనే...

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ క్యూర్ పరిధిలో నిర్మించే ఇందిరమ్మ ఇండ్లు జనావాసాల పరిధిలోనే ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు అధికారులను ఆదేశించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల వివిధ శాఖలకు సంబంధించి నిరుపయోగంగా ఉన్న స్థలాలను గుర్తించాలని అధికారులకు చెప్పారు. కోర్ అర్బన్ ఏరియా (క్యూర్) లో ఇందిరమ్మ ఇండ్లపై ముఖ్యమంత్రి గారు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు, పొన్నం ప్రభాకర్ గారితో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. పలు నియోజకవర్గాల్లో ఇప్పటికే గుర్తించిన స్థలాల గురించి అధికారులు ముఖ్యమంత్రి గారికి వివరించారు. పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖలకు సంబంధించి గుర్తించిన నిరుపయోగ స్థలాలను తీసుకుని, ప్రత్యామ్నాయంగా సంబంధిత శాఖలకు వేరేచోట స్థలాన్ని కేటాయించాలని ఆదేశించారు. జనావాసాలకు దూరంగా ఇందిరమ్మ ఇండ్లను కేటాయిస్తే.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు అవి నిరుపయోగంగా మారే అవకాశం ఉందని ముఖ్యమంత్రి గారు అభిప్రాయపడ్డారు. పని ప్రదేశాలకు దగ్గరగా, జనావాసాల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేలా చూడాలని చెప్పారు. దీని వల్ల నిరుపేదలు జీవనోపాధి కోల్పోకుండా ఉంటారని తెలిపారు. క్యూర్ ఏరియాలో పలు నియోజకవర్గాల్లో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఒక్కో ఫ్లాట్ దాదాపు 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో, 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో నిర్మించనున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి దాదాపు ₹ 11 లక్షలు ఖర్చవుతుండగా, ప్రభుత్వం ఇందులో ₹ 5 లక్షల మేరకు సబ్సిడీని అందిస్తోంది. మిగిలిన ₹ 6 లక్షలు లబ్ధిదారుడి వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. భూమికయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరిస్తోంది. తొలి దశలో 17 నియోజకవర్గాల్లో 7, 680 ఫ్లాట్లు నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మల్కాజ్‌గిరి, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కార్వాన్, బహదూర్‌పురా, అంబర్‌పేట్, కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, సనత్‌నగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, మలక్‌పేట్ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించనుంది. ఈ నియోజకవర్గాల పరిధిలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి గారు ఆదేశించారు.

## విద్యాసంస్థల బంద్ విజయవంతం



**అడవిదేవులపల్లి,ఫ్లాష్ ఇండియా :** దేశవ్యాప్తంగా విద్యార్థులపై జరుగుతున్న అన్యాయాలు, ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్,అలాగే విద్యా వ్యవస్థ పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఎన్ఎస్‌యూఐ తెలంగాణ,ఎస్ఎఫ్ఐ,ఏఐఎస్ఎఫ్,పీడీఎస్‌యూ,యూఎస్ఎఫ్ఐ తదితర వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. నల్గొండ జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు మహ్మద్ ఆరిఫ్ పిలుపు మేరకు, అడవిదేవులపల్లి మండల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు గొడుగు అన్నమయ్య ఆధ్వర్యంలో మండలంలోని విద్యాసంస్థల బంద్ విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వీర్ల శివ, శ్రీకాంత్,మహేష్,వేణు,నాగి, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అసలు రిట్ పిటిషనే
# దాఖలు కాలేదు

**న్యూ ఢిల్లీ :** విద్యార్థుల నిరసనలపై పోలీసుల చర్యను సవాలు చేస్తూ వచ్చిన పిటిషన్‌ను విచారించడానికి నిరాకరించినట్లు వస్తున్న వార్తలను భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ శుక్రవారం కొట్టిపారేశారు. అవన్నీ పూర్తిగా అబద్ధం అని తేల్చి చెప్పారు. ఈ విషయంపై కోర్టులోనే స్పష్టత ఇస్తూ... అసలు సుప్రీంకోర్టులో ఎలాంటి రిట్ పిటిషన్ దాఖలు కాలేదని సీజేఐ తెలిపారు. ఒక న్యాయవాది ఇచ్చిన లేఖ (వినతిపత్రం) మాత్రమే తన వద్దకు వచ్చిందని, అది అధికారికంగా దాఖలు చేసిన పిటిషన్ కాదని వివరించారు.

**మీడియా రిపోర్టింగ్‌పై అసంతృప్తి**

కోర్టులో సరైన పద్ధతిలో దాఖలు చేయకుండా కేవలం ఒక లేఖ ఇస్తే దాన్ని రిట్ పిటిషన్‌గా పరిగణించలేమని సీజేఐ అన్నారు. ఈ విషయంలో మీడియా వ్యవహరించిన తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఆ వార్తలు నిర్లక్ష్యంగా ఉన్నాయని వ్యాఖ్యానించారు.

**సీజేఐ మాటల్లో**

గత రెండు రోజులుగా కేసు దాఖలైందని, దాన్ని ప్రధాన న్యాయమూర్తి విచారించడానికి నిరాకరించారని మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ ఉదయం 10 గంటల వరకు ఒక్క కాగితం కూడా కోర్టులో దాఖలు కాలేదు. అది కేవలం ఒక లేఖ మాత్రమే. దాన్ని నేను పిటిషన్‌గా ఎలా తీసుకోగలను ? కానీ ప్రజలు మాత్రం తమకిష్టమొచ్చినట్లు వార్తలు రాస్తున్నారు అని అన్నారు.

**కోర్టులో ఏం జరిగింది?**

విద్యార్థుల నిరసనలపై పోలీసుల చర్య గురించి న్యాయవాది నరేంద్ర మిశ్రా, సీజేఐ కి రాసిన లేఖను నోటిమాటగా కోర్టు దృష్టికి తెచ్చారు. అయితే దాన్ని విచారించడానికి నిరాకరిస్తూ... “మా సమయాన్ని వృధా చేయకండి, మీ సమయాన్ని కూడా వృధా చేసుకోకండి” అని సీజేఐ వ్యాఖ్యానించారు. పోలీసుల చర్యలకు సంబంధించిన వీడియోలు మా వద్ద ఉన్నాయని న్యాయవాది చెప్పగా... “మాకు ఆ వీడియోలతో పనిలేదు, వాటిని చూసే సమయం కూడా మాకు లేదు” అని సీజేఐ బదులిచ్చారు.

**అసలు ఈ నిరసనలు ఎందుకు జరుగుతున్నాయంటే**

పరీక్షలు, ఉద్యోగ నియామకాల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలతో ఈ నిరసనలు మొదలయ్యాయి. విద్యా వ్యవస్థలో మార్పులు, జవాబుదారీతనం కావాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ‘నీట్ ‘ పేపర్ లీక్ వివాదానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కూడా విద్యార్థులు కోరుతున్నారు. ప్రతిపక్షాల మద్దతుతో విద్యార్థులు చేపట్టిన ‘సంసద్ చలో’ యాత్రను ఢిల్లీ పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత పెరిగింది. ఈ క్రమంలో ఘర్షణలు జరిగి పలువురికి గాయాలయ్యాయి, పోలీసులు కొందరిని అరెస్టు చేసి కేసు బుక్ చేశారు.

## ప్రతి ఆరోగ్యవంతుడు క్రమం తప్పకుండా రక్తదానం చేయాలి



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** అనారోగ్యం, ప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల్లో తోటి మానవుల ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం చేయడం గొప్ప మానవతా సేవ. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న మిర్యాలగూడకు చెందిన చిరంజీవి చిట్యాల ప్రణీత్,తన తల్లిదండ్రులు శ్రీనివాస్,పద్మ లతో పాటు కుటుంబ సభ్యులు,మిత్రుల ప్రోత్సాహంతో సేవాభావాన్ని పెంపొందించుకుని,రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో శ్రీ సత్యసాయి సేవా సమితి, లయన్స్ క్లబ్ సహకారంతో ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్ బోర్డులోని శ్రీ సత్యసాయి సేవా మందిరంలో శుక్రవారం నిర్వహించిన ఈ రక్తదాన శిబిరాన్ని డాక్టర్ పందిరి రవీందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు సామాజికవేత్తలు మాట్లాడుతూ స్వచ్ఛంద రక్తదానం అనేది ప్రాణాలను కాపాడే మహోన్నత సేవ అని, ప్రతి ఆరోగ్యవంతుడు క్రమం తప్పకుండా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె. రవి, డాక్టర్ అశ్విన్ కుమార్, డాక్టర్ జానకి రాములు,డాక్టర్ జె. రాజు,ఆర్.ఎం.పి డాక్టర్ మునీర్,లయన్స్ క్లబ్ అధ్యక్షులు కూటాల రాంబాబు,పి.గోవర్ధన్,కె. శ్రీధర్,శ్రీనివాస్ గుప్తా,కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.




ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా
మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# 15 మంది డిప్యూటేషన్లు రద్దు!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఇటీవల కొత్తగా బాధ్యతలు తీసుకున్న ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్(ఇన్‌చార్జి PCCF) వినయ్ కుమార్.. ఐదుగురు మంత్రులకు ఝలక్ ఇచ్చినట్టు తెలిసింది. బాధ్యతలు తీసుకున్న రెండు రోజులకే అటవీశాఖలో డిప్యూటేషన్లు అన్నింటినీ రద్దు చేశారు. దీంతో వివిధ హోదాల్లో పనిచేస్తోన్న సుమారు 15 మంది అధికారులు తమ సొంత పోస్టింగ్‌లో జాయిన్ అయ్యారు. అందులో ఐదుగురు మంత్రులకు చెందిన సన్నిహితలు సైతం ఉన్నట్టు తెలుస్తోంది. వినయ్ కుమార్ తీసుకున్న నిర్ణయంతో షాక్‌కు గురైన సంబంధిత మంత్రులు.. అటవీశాఖ మంత్రి కొండా సురేఖకు ఫిర్యాదు చేయగా.. ఆ ఫైల్‌ను తనకు పంపాలంటూ ఆదేశించినట్టు తెలుస్తున్నది.

**డిప్యూటేషన్లు అన్ని రద్దు..**

జూన్ 30 వరకు పీసీసీఎఫ్‌గా సువర్ణ పనిచేశారు. అమె హయాంలో సుమారు 15 మంది అధికారులకు (ఫారెస్ట్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు) ఆరోగ్యం, ఫ్యామిలీ కారణాలతో వారు కోరుకున్న చోట డిప్యూటేషన్ పద్ధతిన పనిచేసేందుకు అవకాశం కల్పిస్తూ ఆర్డర్స్ ఇచ్చారు. అందులో ఖమ్మం జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు, దక్షిణ తెలంగాణకు చెందిన ఓ మంత్రి సన్నిహితులు, బంధువులు, పార్టీ లీడర్ల పిల్లలు ఉన్నారు. వారంతా హాయిగా తమకు ఇష్టమైన ప్రాంతాల్లో పనిచేస్తుండగా, ఇన్‌చార్జి హోదాలో బాధ్యతలు తీసుకున్న పీసీసీఎఫ్ వినయ్ కుమార్ వచ్చిన వెంటే సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. రెగ్యూలర్ పోస్టింగ్‌లో కాకుండా, లాబీయింగ్‌తో సుమారు 15 మంది అధికారులు ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్నట్టు గుర్తించారు. దీంతో వెంటనే అటవీ శాఖలో డిప్యూటేషన్లు అన్నింటినీ రద్దు చేస్తున్నట్టు సర్క్యూలర్ జారీ చేశారు. అప్పటివరకు ఇతర ప్రాంతాల్లో డిప్యూటేషన్ పద్ధతిలో పనిచేస్తున్న అధికారులు సొంత ఏరియాల్లో జాయిన్ అవ్వాల్సి వచ్చింది.

**మంత్రికి తెలీకుండానే నిర్ణయం**

సాధారణంగా సహచర మంత్రుల సిఫారసుల మేరకు అధికారులకు డిప్యూటేషన్లు ఇవ్వడం ప్రతి శాఖలో జరుగుతుంటుంది. అందులో భాగంగా మంత్రి కొండా సురేఖ ఐదుగురు మంత్రులు పంపిన సిఫారసులను అప్పటి పీసీసీఎఫ్ సువర్ణకు పంపగా, ఆమె వారందరికీ డిప్యూటేషన్లు ఇచ్చారు. కానీ వినయ్ కుమార్ బాధ్యతలు చేపట్టిన వెంటనే డిప్యూటేషన్లు రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయంలో నిర్ణయం తీసుకునే ముందు మంత్రి కొండా సురేఖ నుంచి అనుమతి తీసుకోలేదని తెలిసింది. ఏకపక్షంగా డిప్యూటేషన్లు రద్దు చేయడంతో బాధితులు అందరూ తమకు సిఫారసు చేసిన మంత్రుల వద్దకు వెళ్లి తమ గోడును వెళ్లబోసుకున్నారు. దీంతో సదరు మంత్రులు మంత్రి కొండా సురేఖకు ఫిర్యాదు చేయగా, ఆమె స్వయంగా పీసీసీఎఫ్‌కు ఫోన్ చేసి ఆరా తీసినట్టు సమాచారం. “రద్దు చేసిన డిప్యూటేషన్లను కొనసాగించాలి. ఒకవేళ మీ స్థాయిలో నిర్ణయం తీసుకోకపోతే ఫైల్‌ను నాకు పంపండి. నేను పర్మిషన్ ఇస్తాను. సెక్రెటరీ జీవో జారీ చేస్తారు” అని ఆదేశించగా, అప్పుడు సరేనంటూ తలూపిన పీసీసీఎఫ్ ఇంతవరకు ఫైల్ పంపలేదని ప్రచారం జరుగుతున్నది.



# పదేళ్ల రోడ్‌మ్యాప్ సిద్ధం చేయాలి

**కొత్తగూడెం,ఫ్లాష్ ఇండియా :** సింగరేణి సంస్థను కేవలం బొగ్గు తవ్వకాలకే పరిమితం చేయకుండా భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా గ్రీన్ ఎనర్జీ, క్రిటికల్ మినరల్స్ వంటి రంగాల్లోకి విస్తరించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. సింగరేణిని కాపాడుకోవడం, బలోపేతం చేయడం, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడం కోసం ప్రజా ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. సంస్థ అభివృద్ధికి ప్రభుత్వ తలుపులు 24 గంటలూ తెరిచే ఉంటాయని భరోసా ఇచ్చారు.కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో సింగరేణి, జెన్‌కో ఉన్నతాధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాల్గొన్నారు. తెలంగాణకు సింగరేణి ఆత్మలాంటి సంస్థ అని, 130 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన ఈ సంస్థ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

రాబోయే 15-20 ఏళ్లలో ప్రపంచ ఇంధన రంగం పూర్తిగా మారిపోతుందన్నారు. సోలార్, పంప్డ్ స్టోరేజ్, విండ్, గ్రీన్ హైడ్రోజన్, రేర్ ఎర్త్ మినరల్స్, బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థల వినియోగం పెరగడంతో థర్మల్ విద్యుత్, బొగ్గు వినియోగం క్రమంగా తగ్గే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ మార్పులను దృష్టిలో పెట్టుకుని సింగరేణి ప్రత్యామ్నాయ వ్యాపార అవకాశాలపై ఇప్పటి నుంచే దృష్టి సారించాలని సూచించారు.ప్రైవేట్ సంస్థలతో పోటీ పెరిగిన నేపథ్యంలో సింగరేణి నాణ్యత, నిర్వహణా సామర్థ్యం, వ్యయ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. తవ్వకాల సమయంలో బొగ్గులో మట్టి, రాళ్లు కలవకుండా కఠిన పర్యవేక్షణ ఉండాలని, బొగ్గు శుద్ధీకరణను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. వివిధ గ్రేడ్ల బొగ్గును శాస్త్రీయంగా బ్లెండింగ్ చేసి వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు అందించాలన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి ముందుచూపు, దీర్ఘకాలిక ప్రణాళికలు లేకపోవడం వల్ల సింగరేణి కొత్త బొగ్గు బ్లాకులను దక్కించుకోలేకపోయిందని విమర్శించారు. భద్రాద్రి, యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అవసరమైన బొగ్గు బ్లాకుల విషయంలో కూడా నిర్లక్ష్యం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒడిశాలోని నైనీ బ్లాక్, తాడిచర్ల-2 బ్లాక్‌లకు సంబంధించిన భూసేకరణ, అటవీ అనుమతుల సమస్యలను వేగంగా పరిష్కరించిందన్నారు.సింగరేణి కేవలం వ్యాపార సంస్థ కాదని, వేలాది కార్మిక కుటుంబాల జీవనాధారమన్నారు. ప్రతి గని స్థాయిలో యాజమాన్యం, కార్మిక సంఘాలు, కార్మికులతో బహిరంగ చర్చలు నిర్వహించి సంస్థ భవిష్యత్తుపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు.లిథియం, కోబాల్ట్ వంటి అరుదైన ఖనిజాల మైనింగ్ రంగంలోకి సింగరేణి అడుగుపెట్టాలని సూచించారు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా వంటి దేశాల్లో జరిగే క్రిటికల్ మినరల్స్ వేలాల్లో పాల్గొనే అవకాశాలను పరిశీలించాలన్నారు. సింగరేణి వద్ద ఉన్న అనుభవజ్ఞులైన ఇంజనీర్లు, మైనింగ్ నిపుణుల సామర్థ్యాన్ని అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్టులకు వినియోగించాలని సూచించారు.ఇకపై బోర్డు సమావేశాలు సాధారణ పరిపాలనా అంశాలకే పరిమితం కాకుండా సంస్థ విస్తరణ, ప్రత్యామ్నాయ పెట్టుబడులు, భవిష్యత్ వ్యూహాలపై చర్చించే వేదికగా మారాలని సూచించారు. కార్పొరేట్ సంస్థల తరహాలో టైమ్‌లైన్ ఆధారంగా లక్ష్యాలను నిర్దేశించుకుని అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

# ఇది భయపడే జనరేషన్ కాదు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** నీట్ ప్రశ్నపత్రాల లీకేజీకి నిరసనగా, ఢిల్లీలో పోరాడుతున్న విద్యార్థులపై కేంద్ర పోలీసుల అణచివేత ధోరణికి వ్యతిరేకంగా తెలంగాణలో బీఆర్ఎస్ పోరుబాట పట్టింది. బీఆర్ఎస్ అనుబంధ విద్యార్థి విభాగం పిలుపు మేరకు శుక్రవారం హైదరాబాద్లోని ఇందిరాపార్క్ (ధర్నా చౌక్) వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ ధర్నాకు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, యువకులు భారీగా తరలివచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నల్ల చొక్కా ధరించి పాల్గొన్నారు. తన జన్మదిన వేడుకలను సైతం రద్దు చేసుకుని విద్యార్థుల హక్కుల కోసం నేరుగా ధర్నా స్థలానికి వచ్చి నిరసన తెలిపారు. ఈ ధర్నాలో కేటీఆర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. “దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకున్న నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలి” అని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల జులుం నశించాలని, యువతపై జరుగుతున్న దమనకాండను వెంటనే ఆపాలని నినాదాలు చేశారు.

**ఇది భయపడే జనరేషన్ కాదు..**

“ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన దాడులు చూస్తుంటే చాలా బాధగా ఉంది. కళ్లలో నీళ్లొస్తున్నాయి. విద్యార్థులేమైనా మోడీ, అమిత్ షాల కుర్చీలు అడిగారా? లేక రాజీనామాలు చేసి ప్రభుత్వాన్ని అప్పగించమన్నారా? కేవలం తమకు జరిగిన అన్యాయంపై శాంతియుతంగా న్యాయం మాత్రమే అడిగారు” అని ప్రశ్నించారు. యువత శక్తిని తక్కువ అంచనా వేయొద్దని హితవు పలికారు. ఇది భయపడే జనరేషన్ కాదు.. పాలకులను భయపెట్టే జనరేషన్ అని సూచించారు. ఇటీవల యువతతో పెట్టుకున్న నేపాల్, బంగ్లాదేశ్ ప్రభుత్వాలు ఎలా కుప్పకూలాయో కేంద్రం గుర్తుంచుకోవాలి అని హెచ్చరించారు. గతంలో ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ సాధించిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా విద్యార్థుల కోసం కేంద్ర అరాచకాలను గట్టిగా ఎండగడతామని స్పష్టం చేశారు. న్యాయం జరిగే వరకు విద్యార్థులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని, దేశవ్యాప్తంగా పార్టీలకు అతీతంగా యువత కదం తొక్కుతోందని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపైనా కేటీఆర్ విమర్శలు చేశారు. తాము కేంద్ర విధానాలను ఎండగట్టేందుకు ధర్నా చేస్తుంటే రేవంత్ రెడ్డికి ఎందుకు భయం అవుతుందని ప్రశ్నించారు. తమ ధర్నాకు యూత్ కాంగ్రెస్ అడ్డురావడంపై కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

**కేంద్ర మంత్రి రాజీనామా చేయాలి..**

**విద్యార్థులపై కేసులు ఎత్తివేయాలి: కేటీఆర్..**

ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై జరిగిన దాడులు అమానుషమని కేటీఆర్ పేర్కొన్నారు. యువత జవాబుదారీతనం కోరుతోందని.. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. యువతపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థులకు సంఘీభావం తెలుపుతూ హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద కేటీఆర్ నిరసన దీక్ష చేపట్టారు.ఈ సందర్భంగా ఢిల్లీలో విద్యార్థులు, యువత పోరాటానికి బీఆర్ఎస్ తరఫున కేటీఆర్ సంఘీభావం ప్రకటించారు. 25 రోజులుగా ఢిల్లీలో పార్టీలకు అతీతంగా యువత పోరాడుతోందన్నారు.

యువతపై జరుగుతున్న దాడులను దారుణమని తీవ్రంగా ఖండించారు. ఎవరితో పెట్టుకోకూడదో వారితోనే ప్రధాని మోదీ పెట్టుకున్నారని.. ఈ జనరేషన్ చావుకు, ఐటీ, ఈడీ సోదాలకు భయపడేది కాదన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ.. మేక్ ఇన్ ఇండియా అడిగితే లీక్ ఇన్ ఇండియా ఇచ్చారంటూ సెటైర్లు వేశారు. న్యాయం చేయాలని విద్యార్థులు అడుగుతున్నారని, వారికి అండగా నిలబడతామని కేటీఆర్ చెప్పుకొచ్చారు. ప్రధాని మోదీపై కొట్లాడితే చోటాభాయ్‌కు ఎందుకు కోపం వస్తుందో అర్థం కావడం లేదని సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ చురకలు అంటించారు. మోదీ అంటే రేవంత్‌కు ఎందుకంత భయమంటూ ప్రశ్నించారు. పాత కేసులు తోడుతారని సీఎం భయపడుతున్నారని ఎద్దేవా చేశారు.ఢిల్లీలో మోదీ ఇంటి ముందు రాహుల్ గాంధీ ధర్నా చేస్తే రేవంత్ ఎక్కడ ఉన్నారని కేటీఆర్ ప్రశ్నించారు. నీట్ పేపర్ లీక్‌పై ఆయన ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నలు సంధించారు. విద్యార్థులను కొడుతుంటే సీఎం ఎందుకు మౌనంగా ఉన్నారన్నారు. పేపర్ లీక్‌కు తనకు సంబంధం ఏంటని, యూత్ కాంగ్రెస్ వాళ్లకు బుద్ధి ఉందా? అంటూ మండిపడ్డారు. వాళ్లు దేశంలో ఏం జరిగినా.. కేసీఆర్, కేటీఆర్‌దే తప్పు అంటున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డికి నిద్రలో కూడా కేసీఆరే గుర్తు వస్తున్నారని కేటీఆర్ చురకలు అంటించారు. నీట్ విద్యార్థులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

# కీలక రైలు మార్గానికి గ్రీన్‌సిగ్నల్..

**న్యూ ఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో కర్ణాటక-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య బళ్లారి-గుంతకల్ రైల్వే మార్గంలో 3వ, 4వ లైన్ల నిర్మాణానికి రూ.1,264 కోట్ల వ్యయంతో ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టు ద్వారా రైల్వే సరుకు రవాణా సామర్థ్యం పెరగడంతో పాటు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ ప్రాజెక్టును పీఎం గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్ పరిధిలో రూపొందించారు. బహుళ రవాణా అనుసంధానం (మల్టీ-మోడల్ కనెక్టివిటీ), లాజిస్టిక్స్ సామర్థ్యాన్ని పెంచే లక్ష్యంతో సమగ్ర ప్రణాళిక ప్రకారం దీనిని అమలు చేయనున్నారు. ప్రజలు, వస్తువులు, సేవల రవాణా మరింత వేగవంతంగా సాగేందుకు ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

**46 కిలోమీటర్ల మేర రైల్వే విస్తరణ**

కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని మూడు జిల్లాల మీదుగా సాగే ఈ ప్రాజెక్టుతో భారతీయ రైల్వే నెట్‌వర్క్‌కు సుమారు 46 కిలోమీటర్ల కొత్త ట్రాక్‌లు జతకానున్నాయి. దీంతో ఈ మార్గంలో రైళ్ల రాకపోకలు మరింత సులభతరం అవుతాయి. అలాగే ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 99 గ్రామాలకు మెరుగైన రైల్వే అనుసంధానం లభించనుంది. ఈ గ్రామాల్లో దాదాపు 7 లక్షల మంది జనాభా నివసిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.ఈ రైల్వే మార్గ విస్తరణతో బళ్లారి కోట, శ్రీ కుమారస్వామి ఆలయం వంటి ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాలకు రైలు కనెక్టివిటీ మెరుగుపడనుంది. దీంతో పర్యాటక రంగానికీ ఊతం లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఈ మార్గం ద్వారా ఇనుప ఖనిజం, డోలమైట్, సున్నపురాయి, ఇనుము-ఉక్కు, బొగ్గు, ఎరువులు, ఆహార ధాన్యాలు వంటి కీలక వస్తువులు పెద్ద ఎత్తున రవాణా అవుతున్నాయి. కొత్త లైన్లు అందుబాటులోకి వస్తే ఏటా అదనంగా 16.22 మిలియన్ టన్నుల సరుకు రవాణా సామర్థ్యం పెరుగుతుందని అంచనా.

**పర్యావరణానికి మేలు**

ఈ ప్రాజెక్టు అమలుతో రోడ్డు రవాణాపై ఆధారపడటం తగ్గి, రైల్వే ద్వారా సరుకు రవాణా పెరుగుతుంది. ఫలితంగా 1.32 కోట్ల లీటర్ల చమురు దిగుమతులు తగ్గడంతో పాటు, 6.67 కోట్ల కిలోల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు తగ్గుతాయి. ఇది సుమారు 27 లక్షల చెట్లను నాటినంత పర్యావరణ ప్రయోజనం కలిగిస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. కేంద్రం ప్రకారం.. ఈ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత భారతీయ రైల్వేలో లైన్ సామర్థ్యం పెరిగి, రైళ్ల రాకపోకలు మరింత సమర్థవంతంగా సాగడంతో పాటు ప్రయాణికులు, సరుకు రవాణా సేవలు మరింత విశ్వసనీయంగా మారనున్నాయి.అలాగే దేశవ్యాప్తంగా మూడు ప్రత్యేక కెమికల్ పార్కుల ఏర్పాటు కోసం రూ.3,030 కోట్లతో ‘భారత్ ఔద్యోగిక వికాస్ యోజన--రసాయన్’ పథకానికి ఆమోదం లభించింది. దేశంలో రసాయన పరిశ్రమను మరింత బలోపేతం చేయడం, ప్రపంచ స్థాయిలో పోటీతత్వాన్ని పెంచడం, పారిశ్రామిక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం ఈ పథకం ప్రధాన లక్ష్యమని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కేబినెట్ నిర్ణయాలను వెల్లడించారు. ఈ పథకాన్ని 2026-27 కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించగా మొత్తం రూ.3,030 కోట్ల వ్యయంతో అమలు చేయనున్నారు. ఇందులో రూ.3,000 కోట్లు కెమికల్ పార్కుల్లో ఉమ్మడి మౌలిక సదుపాయాల నిర్మాణానికి కేటాయించగా, రూ.30 కోట్లు పరిపాలనా ఖర్చులకు వినియోగించనున్నారు. ఈ పథకాన్ని ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచి 2030-31 వరకు ఐదేళ్లలో అమలు చేయనున్నారు.

**ప్రతి పార్కుకు రూ.1,000 కోట్ల కేంద్ర సాయం**

ఈ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వాలు ఛాలెంజ్ ఆధారిత ఎంపిక విధానం ద్వారా మూడు కెమికల్ పార్కులను అభివృద్ధి చేయనున్నాయి. ప్రతి పార్కు కోసం కేంద్రం గరిష్టంగా రూ.1,000 కోట్ల గ్రాంట్ అందిస్తుంది. అయితే సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం కనీసం రూ.500 కోట్లు వాటా ఇవ్వాల్సి ఉంటుంది. ప్రతి కెమికల్ పార్కు ఏర్పాటుకు కనీసం 2,000 ఎకరాలు (8 చదరపు కిలోమీటర్లు) వివాదరహిత భూమి ఉండాల్సి ఉంటుంది.

**ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు**

**ఈ కెమికల్ పార్కుల్లో పరిశ్రమలకు అవసరమైన ప్లగ్-అండ్-ప్లే మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు ఇందులో:**

కామన్ ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు
ట్రీట్‌మెంట్, స్టోరేజ్ అండ్ డిస్పోజల్ ఫెసిలిటీ
ప్రమాదకర వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు
నీటి సరఫరా వ్యవస్థ
సాల్వెంట్ రికవరీ, డిస్టిలేషన్ యూనిట్లు
ఆవిరి (స్టీమ్) పంపిణీ వ్యవస్థ
ఇంటర్‌కనెక్టెడ్ పైప్‌లైన్ నెట్‌వర్క్
లాజిస్టిక్స్, గిడ్డంగుల సదుపాయాలు వంటి అత్యాధునిక సదుపాయాలు అందుబాటులో ఉంటాయి.

**పరిశ్రమలకు భారీ ఊతం**

ఈ పథకం ద్వారా అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్, అనుబంధ పరిశ్రమలు వేగంగా అభివృద్ధి చెందుతాయని కేంద్రం తెలిపింది. లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గడంతో పాటు ఉత్పత్తి వ్యయాలు తగ్గి, భారతీయ తయారీ సంస్థలు ప్రపంచ మార్కెట్లో మరింత పోటీ సామర్థ్యాన్ని సాధిస్తాయని పేర్కొంది. అలాగే దేశీయ ఉత్పత్తి సామర్థ్యం పెరగడం, దిగుమతులపై ఆధారపడటం తగ్గడం, ఎగుమతులు పెరగడం, విదేశీ పెట్టుబడులు ఆకర్షించడం వంటి ప్రయోజనాలు ఈ పథకం ద్వారా కలుగుతాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

**ఉపాధి అవకాశాలు.. ‘వికసిత్ భారత్ 2047’కు ఊతం**

రసాయన, పెట్రోకెమికల్ రంగాలు వ్యవసాయం, వస్త్ర పరిశ్రమ, ఔషధాలు, న్యూట్రాస్యూటికల్స్, నిర్మాణ రంగం, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్ వంటి కీలక రంగాలకు ముడి పదార్థాలను అందిస్తున్నాయని ప్రభుత్వం పేర్కొంది. ఈ మూడు కెమికల్ పార్కుల ఏర్పాటు ద్వారా వేలాది ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు ‘వికసిత్ భారత్ 2047’ లక్ష్య సాధనకు కూడా ఈ పథకం దోహదపడుతుందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

# అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటాలి

**సిద్దిపేట,ఫ్లాష్ ఇండియా :** అంతర్జాతీయ వేదికలపై సిద్దిపేట క్రీడాకారులు సత్తా చాలని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు పిలుపునిచ్చారు. సిద్దిపేట పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో అండర్-13, అండర్-15 బాలురు, బాలికల బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ను ఎమ్మెల్యే హరీష్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వంలో సిద్దిపేట స్టేడియానికి రూ.11 కోట్ల నిధులు కేటాయిస్తే కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్ధాంతరంగా పనులను నిలిపి వేసిందన్నారు. సిద్దిపేట ప్రాంతం తెలంగాణలో భాగం కదా.. సిద్దిపేట క్రీడాకారులు తెలంగాణ వాళ్లు కాదా అని సూటిగా ప్రశ్నించారు. సిద్దిపేట క్రీడాకారుల మీద కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష చూపుతోంది అన్నారు. సిద్దిపేట స్పోర్ట్స్ హబ్‌గా దేశానికి ఆదర్శంగా నిలవాలనేది నా కల అన్నారు. ఫుట్‌బాల్ మైదానంలో శిక్షణ పొందిన క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగడం ఆనందంగా ఉందన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వం పెరుగుతుంది అన్నారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ఆగిపోయిన పనులు పూర్తి చేయిస్తా అన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సిద్దిపేట మున్సిపాలిటీ అభివృద్ధి పనుల పై మున్సిపల్ అధికారులతో హరీష్ రావు సమీక్ష నిర్వహించారు. ఇంజనీరింగ్, సానిటరీ విభాగాల్లో సిబ్బంది కొరత పై పబ్లిక్ హెల్త్ ఈ ఎన్ సీ తో హరీష్ రావు ఫోన్ లో మాట్లాడి రెగ్యులర్ సిబ్బందిని కేటాయించాలని కోరారు. నర్సపూర్, ఎర్ర చెరువు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ ను ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న బీటీ, సీసీ రోడ్లు పూర్తి చేయాలన్నారు. అధికారుల సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ సమీక్ష లో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# "డ్రై డే ఫ్రైడే" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## ప్రతి శుక్రవారం “డ్రై డే ఫ్రైడే” కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** తెలంగాణ ప్రభుత్వం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఽ అర్బన్ డెవలప్‌మెంట్ (MA&UD) శాఖ ఆదేశాల మేరకు జనగామ మున్సిపాలిటీ పరిధిలో ప్రతి శుక్రవారం “డ్రై డే ఫ్రైడే” కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ, డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించేందుకు ప్రతి శుక్రవారం “డ్రై డే ఫ్రైడే” పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ప్రతి ఇంటి యజమాని, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు తమ పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, నీటి నిల్వ పాత్రలను వారానికి ఒకసారి పూర్తిగా ఖాళీ చేసి శుభ్రపరచాలని, కూలర్లు, ట్యాంకులు, టైర్లు, కొబ్బరి చిప్పలు, పూల కుండీలు వంటి ప్రదేశాల్లో నీరు నిల్వ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.మున్సిపల్ సిబ్బంది వార్డు వారీగా డ్రై డే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన జనగామ నిర్మాణానికి సహకరించాలని కమిషనర్ కోరారు..



## సంపాదకీయం

# జెన్ జెడ్ ఉద్యమం..

భారతదేశం ఇప్పుడు ఒక కొత్త రాజకీయ శక్తి ఆవిర్భావానికి సాక్ష్యమిస్తోంది. అ శక్తి ఒక రాజకీయ పార్టీ కాదు.. జెన్ జెడ్ అనే దేశవ్యాప్తంగా ఉవ్వెత్తున ఎగిసిన ఒక కొత్త తరంగం. పరీక్షలలో అవకతవకలు, నిరుద్యోగం, కొరవడిన పారదర్శకత, జవాబుదారీతనం వంటి సమస్యలపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత స్వచ్ఛందంగా ఏకమై ధ్వజమెత్తారు. ఇది కేవలం ఒకే ఒక్క సంఘటనపై కలిగిన ఆగ్రహానికి మించి మరింత లోతైన విషయాన్ని ప్రతిబింబిస్తోంది. అన్యాయం జరిగిందని భావించినప్పుడు మౌనంగా ఉండటానికి ఇష్టపడని ఒక తరం ఆవిర్భావానికి ఇది సంకేతం. నేటి విద్యార్థులు విజ్ఞానవంతులు, ధైర్యవంతులు. వారు పాలనలో నాణ్యత, ప్రభుత్వ విద్య భవిష్యత్తు, తమకు అందుబాటులో ఉన్న అవకాశాల గురించి సమంజసమైన ప్రశ్నలను సూటిగా అడుగుతున్నారు. అయితే, వారిపట్ల సానుభూతితో జవాబుదారీతనంతో స్పందించడానికి బదులుగా కేంద్ర ప్రభుత్వం ఈ ఆందోళనలపై చాలాసార్లు అణచివేత వైఖరిని అవలంబించి ఘర్షణలతోనే సమాధానమిచ్చింది. శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల చర్యలకు సంబంధించిన దృశ్యాలు కోట్లాది మంది భారతీయులను కలవరానికి గురిచేశాయి. ఎందుకంటే, ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం అసమ్మతిని బలప్రయోగంతో కాకుండా చర్చల ద్వారా పరిష్కరిస్తుందని వారు విశ్వసించారు. విద్యా వ్యవస్థలోని అత్యున్నత స్థాయిలలో బాధ్యత వహించాలనే పిలుపులతో సహా, జవాబుదారీతనం కోసం కొనసాగుతున్న డిమాండ్ కేవలం ఒక మంత్రికి లేదా ఒక సంఘటనకు సంబంధించినది కాదు. పబ్లిక్ సంస్థలు విఫలమైనప్పుడు ప్రభుత్వాలు తమ తప్పును అంగీకరించాలనే విస్తృతమైన అంచనాకు ఇది సంబంధించినది. నాయకులు తమ తప్పులను అంగీకరించి, సంస్థాగత వైఫల్యాలను సరిదిద్ది, ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించినప్పుడు ప్రజాస్వామ్యాలు మరింత బలపడతాయి. ఈ యువజన సమీకరణ ప్రాముఖ్యత కేవలం పరీక్షల తక్షణ సమస్యకే పరిమితం కాదు. ఇది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిర్వచనంగా మారిన పాలనా శైలి పట్ల పెరుగుతున్న నిరాశను ప్రతిబింబిస్తోంది.

**శాంతియుత నిరసనలపై కేంద్రం బలప్రయోగం ప్రజావ్యతిరేక పాలనతో అధికార కేంద్రీకరణ**

విమర్శలను ఏమాత్రం సహించకపోవడం, ప్రజాస్వామ్యానికి ఉన్న అవకాశాలు కుంచించుకుపోవడం, శాంతియుత నిరసనలపై చర్చలకు బదులుగా బలప్రయోగం చేసే ధోరణి వంటివి యువత గళమెత్తడానికి కారణాలుగా ఉన్నాయి. యువ భారతదేశం ఒక స్పష్టమైన సందేశాన్ని పంపుతోంది. జవాబుదారీతనం, కరుణ, రాజ్యాంగ విలువలతో కూడిన పాలనను నేటి తరం కోరుకుంటోంది. భారతదేశపు జెన్ జెడ్ కేవలం సిద్ధాంతాలతోనే ముందుకు వెళ్లడం లేదు. అది ఆకాంక్షలతో నడుస్తోంది. ప్రతిభకు ప్రతిఫలం, సంస్థల విశ్వసనీయత, సమాన అవకాశాలు, రాజ్యాంగం కేవలం ప్రసంగాలలోనే కాకుండా పాలనలో గౌరవించే దేశాన్ని ఈ తరం కోరుకుంటోంది. గణతంత్ర భవిష్యత్తుపై వారికి ప్రగాఢమైన శ్రద్ధ ఉన్నందువల్లే వారు కేంద్రాన్ని కఠినమైన ప్రశ్నలు అడుగుతున్నారు. జెన్ జెడ్ డిమాండ్లు అణచివేతకు కాదు, చర్చలకు అర్హమైనవిగా మోదీ సర్కార్ గుర్తించాలి.

**జెన్ జెడ్‌కు రాహుల్ నైతిక ధైర్యం**

ఈ కీలకమైన తరుణంలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విద్యార్థులతో మమేకమై వారితో భుజం భుజం కలిపి నిలబడాలని నిర్ణయించుకున్నారు. రాహుల్ గాంధీ నేరుగా విద్యార్థులను కలుసుకున్నారు. వారి మాటలు విన్నారు. పార్లమెంటులోనూ, దేశవ్యాప్తంగానూ వారి ఆందోళనలను విస్తృతంగా వినిపించారు. భారతీయ యువతను మోదీ ప్రభుత్వం శత్రువులుగా చూడకుండా, భారతదేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువ భారతీయులను భాగస్వాములుగా చేయాలని ఆయన కోరారు. కేవలం రాజకీయ నినాదాల కోసం కాకుండా, సానుభూతి, నిజాయితీ, నైతిక ధైర్యం కోసం ఎదురుచూస్తున్న నేటి తరానికి రాహుల్ ప్రజాస్వామ్య విధానం ఎంతగానో నచ్చింది. అందువల్ల, ప్రజాస్వామ్య, సమ్మిళిత, రాజ్యాంగబద్ధమైన ప్రత్యామ్నాయాన్ని అందించగల ప్రధాన జాతీయ నాయకుడిగా రాహుల్ గాంధీని చాలామంది యువ భారతీయులు చూడటంలో ఆశ్చర్యం లేదు. విభజనకు బదులుగా సంభాషణ, ఘర్షణకు బదులుగా కరుణ, నిరంకుశత్వానికి బదులుగా రాజ్యాంగబద్ధత అనే రాహుల్ రాజకీయాలు.. భయానికి బదులుగా ఆశను కలిగించే రాజకీయాలను కోరుకునే తొలిసారి ఓటర్లు, యువ భారత పౌరుల ఆదరణ పొందాయి. చారిత్రాత్మకంగా కాంగ్రెస్ పార్టీ తన గొప్ప బలాన్ని సామాన్య భారతీయుల, ముఖ్యంగా యువత ఆకాంక్షల నుంచే పొందింది.

**ప్రజాస్వామ్య ఉద్యమాలకు... భారతీయ యువత ఆదర్శం**

మనం వారి సమస్యలను చిత్తశుద్ధితో విని, సమస్యల పరిష్కారానికి విశ్వసనీయమైన విధాన ప్రత్యామ్నాయాలను అందిస్తూ.. రాజ్యాంగ విలువలను పరిరక్షించడంలో దృఢంగా నిలబడితే ఈ వర్ధమాన తరానికి కాంగ్రెస్‌పై విశ్వాసం మరింతగా పెరుగుతుంది. పరివర్తనాత్మక రాజకీయ మార్పుకు తరచుగా యువతే నాయకత్వం వహిస్తారని చరిత్ర మనకు బోధిస్తుంది. స్వాతంత్ర్య పోరాటం నుంచి ఆ తర్వాతి ప్రజాస్వామ్య ఉద్యమాల వరకు భారతదేశ యువత ఆదర్శవాదం, ధైర్యమే రాజకీయ వ్యవస్థను దిగివచ్చి వినేలా చేసింది. ప్రస్తుత ఉద్యమం కూడా అలాంటి మరో కీలక ఘట్టంగా మారే సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఇది కేవలం పరీక్షలు లేదా ఉద్యోగాలకు సంబంధించిన ఉద్యమం కాదు. ఇది భారత ప్రజాస్వామ్య స్వరూపానికే సంబంధించినది. విశ్వవిద్యాలయాలలో, తొలిసారి ఓటు వేయనున్న వారిలో, భారతదేశ యువతలోని విస్తృత వర్గాలలో ఒక స్పష్టమైన రాజకీయ భావన రూపుదిద్దుకోవడం ప్రారంభమైంది. రాహుల్ గాంధీ దేశానికి ప్రాధాన్యమిచ్చే ప్రత్యామ్నాయ ప్రజాస్వామ్య నాయకుడిగా అంతకంతకూ గుర్తింపు పొందుతున్నారు. చాలామంది యువ భారతీయుల దృష్టిలో రాహుల్ గాంధీని ప్రత్యేకంగా నిలబెట్టేది కేవలం ఆయన రాజకీయాలు మాత్రమే కాదు. మాట్లాడే ముందు ఇతరుల మాట వినడానికి సిద్ధంగా ఉండటం, తమ మాట పాలకులు వినడం లేదని భావించేవారికి అండగా నిలవడం, గణనీయమైన రాజకీయ మూల్యం చెల్లించాల్సి వచ్చినా రాజ్యాంగ విలువలను పరిరక్షించడం వంటివి రాహుల్ గాంధీని ప్రత్యేకంగా నిలిపాయి.

**రాహుల్ నాయకత్వంపై యువత భరోసా**

జెన్ జెడ్ తరానికి నాయకత్వం అనేది ఇకపై కేవలం వాక్చాతుర్యం లేదా ఎన్నికల లెక్కలతో కొలవడం కుదరదు. అది నిజాయితీ, సానుభూతి, కఠినమైన ప్రశ్నలను ఎదుర్కొనే ధైర్యంతో కొలవడం జరుగుతుంది. రాహుల్ గాంధీలో చాలామంది యువ భారతీయులు ఈ విలువలను నిలకడగా సమర్థించిన నాయకుడిని చూస్తున్నారు. ఈ ఉద్యమ సమయంలో విద్యార్థులకు ఆయన చూపిన సంఘీభావం ఆ అభిప్రాయాన్ని మరింత బలపరిచింది. కొత్త తరానికి, వారు తమ సొంత వ్యక్తిగా భావిస్తున్న నాయకుడికి మధ్య భావోద్వేగ బంధాన్ని దృఢపరిచింది. స్వాతంత్ర్య భారతదేశంలో జరిగిన ప్రతి ప్రధాన రాజకీయ పరివర్తనకు యువత ఆకాంక్షలే చోదకశక్తిగా నిలిచాయి. ప్రస్తుత విద్యార్థి ఉద్యమ పరంపర కూడా అలాంటి మరో కీలక ఘట్టంగా మారే సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ ప్రజాస్వామ్య శక్తి ఇలాగే పెరుగుతూ ఉంటే, భారతదేశ యువత ఆందోళనలు జాతీయ చర్చల్లో కేంద్ర స్థానంలో ఉంటే కాంగ్రెస్ విశ్వసనీయమైన, రాజ్యాంగబద్ధమైన, సమ్మిళిత ప్రత్యామ్నాయాన్ని అందిస్తుంది. ఈ ఉద్యమం దేశ రాజకీయ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చివేయగలదు.

**ప్రజాస్వామ్య నాయకుడిగా రాహుల్ గాంధీ**

2029 వైపు దేశ ప్రయాణం ఇప్పుడే మొదలైంది. కానీ చరిత్ర తన గమనాన్ని మార్చుకునే ముందు తరచుగా నిశ్శబ్దంగా తన ఉనికిని చాటుకుంటుంది. నేడు భారతదేశ క్యాంపస్‌ల నుంచి వినిపిస్తున్న స్వరం కేవలం మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసే నిరసన మాత్రమే కాదు. అది కరుణ, జవాబుదారీతనం, రాజ్యాంగబద్ధమైన, నైతికతలో పాతుకుపోయిన ఒక విభిన్నమైన రాజకీయ శైలికి పిలుపు. ఆ పిలుపు రాహుల్ గాంధీ నాయకత్వం చుట్టూ అంతకంతకూ కేంద్రీకృతమవుతోంది. చరిత్ర చివరికి ఈ గమనాన్ని ధృవీకరిస్తుందా లేదా అనేది ఎప్పటిలాగే భారతదేశ ప్రజల వివేకంపైనే ఆధారపడి ఉంటుంది. అయినప్పటికీ, రాహుల్ గాంధీ దేశం కోరుకుంటున్న ప్రత్యామ్నాయ ప్రజాస్వామ్య నాయకుడిగా ఎదుగుతున్నారనే విషయం అంతకంతకూ స్పష్టమవుతోంది. ఈ జోరు ఇలాగే బలం పుంజుకుంటూ ఉంటే, 2029 సార్వత్రిక ఎన్నికల తర్వాత దేశానికి నాయకత్వం వహించే బాధ్యతను భారత ప్రజలు రాహుల్ గాంధీకి అప్పగించే అవకాశం ఉంది. అప్పుడు జెన్ జెడ్ ఉద్యమం కేవలం ఒక విద్యార్థి నిరసనగా మాత్రమే కాకుండా, భారతదేశపు తదుపరి రాజకీయ అధ్యాయానికి నాందిగా గుర్తుండిపోవచ్చు.

# సామాన్యుడిపై ప్రభావం ఎంత?

ఓవైపు ఎల్‌నినో.. మరోవైపు యుద్ధం సామాన్యుల్ని భయపెడుతున్నాయి. ఇప్పటికే యుద్ధం దెబ్బకు కుదేలైన మధ్యతరగతికి.. పులి మీట పుట్రలా ఎల్‌నినో వచ్చి పడింది. ఈ రెండింటి కారణంగా రూపాయి విలువ తగ్గుతోంది. ద్రవ్యోల్బణం పెరుగుతోంది. తద్వారా కొనుగోలు శక్తి తగ్గుతోంది. ఏతావాతా మధ్యతరగతికి రాబోయేది గడ్డురోజులేననే సంకేతాలు కనిపిస్తున్నాయి. అప్రమత్తంగా లేకపోతే చిక్కులు తప్పని దుస్థితి. అందుబాటులో ఉన్న వనరుల్ని, చేతిలో ఉన్న డబ్బును చాలా జాగ్రత్తగా వాడుకోవాల్సిన అవసరం ఉంది. ఇరాన్ యుద్ధం ఆగే ప్రసక్తే లేదని తేలిపోవడంతో.. నిరాశలో మునిగిన ప్రపంచానికి.. ఎల్‌నినో ప్రభావం ఏమాత్రం మింగుడుపడటం లేదు. ఇప్పటికే మన దేశంలో ఎల్‌నినో ప్రభావంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. గతంలో ఎన్నో సంక్షోభాల నుంచి దేశాన్ని బయటపడేసిన వ్యవసాయ రంగమే.. ఇప్పుడు ఎల్‌నినోతో సంక్షోభంలోకి వెళ్లే దుస్థితి నెలకొనడంతో.. భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. ఏ ముహూర్తాన కరోనా వచ్చిందో కానీ.. అప్పట్నుంచీ ప్రపంచం కష్టాల సుడిగుండంలో చిక్కుకుంది. కరోనా పూర్తిగా తగ్గుముఖం పట్టక ముందే.. ఉక్రెయిన్ యుద్ధం మొదలైంది. అది కొనసాగుతుండగానే ఇరాన్ యుద్ధం వచ్చి పడింది. ఈ యుద్ధం ఆగినట్టే ఆగి.. మళ్లీ తీవ్ర రూపం తీసుకుంటున్న తరుణంలో.. ఎల్‌నినోతో మిగిలి ఉన్న కాస్త ఆశలు కూడా ఆవిరయ్యే దుస్థితి వచ్చేసింది. ఓవైపు యుద్ధం.. మరోవైపు ఎల్‌నినో ప్రభావంతో మధ్యతరగతికి మరిన్ని కష్టాలు తప్పవని తేలిపోయింది. యుద్ధం కారణంగా ఇంధన, సరఫరా సమస్యలు వచ్చి.. ధరలు పెరిగి.. ద్రవ్యోల్బణం పెరిగింది. దీంతో ఆర్థిక సంక్షోభం వచ్చేసింది. కాకపోతే ఆర్థిక సమస్యలు వచ్చినా.. వ్యవసాయం బాగుంటే ఏదోలా నెట్టుకురావచ్చనుకున్న సామాన్యుడి ఆశలపై ఎల్‌నినో నీళ్లు చల్లింది. ఇప్పుడు ఎల్‌నినో కారణంగా వర్షాభావంతో.. సాగువిస్తీర్ణం భారీగా తగ్గింది. కరోనా సమయం నుంచీ ఊహించని పంటల దిగుబడులతో.. ఇతర దేశాలను ఉదారంగా ఆదుకున్నాక కూడా.. మనకు తిండిగింజలకు కొరత రాలేదు. కానీ ఇప్పుడు ఎల్‌నినో ఆ పరిస్థితిని రివర్స్ చేసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. వ్యవసాయం కుదేలై.. పంటల దిగుబడులు తగ్గితే.. ఆహార సమస్య వచ్చి.. అది ఆహార ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. అప్పుడు అటు ఆర్థికంగా చితికిపోయి.. ఇటు ఆహారం కూడా దొరకని పరిస్థితుల్లో.. సామాన్యులు మరింతగా విలవిల్లాడటం ఖాయమనే అంచనాలు అందర్నీ భయపెడుతున్నాయి. సరే ఎక్కడ ఏ సంక్షోభం వచ్చినా సామాన్యుడే సమిధగా మారుతున్న వాస్తవం కూడా అందరికీ తెలిసిందే. కాబట్టే ఇప్పుడు ఒకదానిపై ఒకటిగా వచ్చిపడుతున్న సమస్యల ధాటికి.. దేశంలో మధ్యతరగతి ఏమైపోతుందోననే ఆందోళన కనిపిస్తోంది. ఎందుకంటే ఆర్థిక సంస్కరణల తర్వాత.. దేశ అభివృద్ధి రథాన్ని ముందు లాగుతోంది మధ్యతరగతే. ఇప్పుడు అలాంటి మధ్యతరగతి నడ్డివిరిగే పరిస్థితులు ఒకదానితర్వాత ఒకటిగా చాలా వేగంగా ఏర్పడుతుండటం.. దీర్ఘకాలిక సంక్షోభాలకు దారితీసే ప్రమాదం లేకపోలేదు. వర్షాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న అన్నదాతలకు మున్ముందు మరిన్ని కష్టాలు తప్పేలా లేవు. ఇప్పటికే ఖరీఫ్ సాగును ప్రశ్నార్థకం చేసిన ఎల్‌నినో, వచ్చే ఏడాది మార్చి దాకా ఉంటుందని, తద్వారా యాసంగి సాగునూ అది దెబ్బతీసే అవకాశాలున్నాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఆగస్టులో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నా.. సెప్టెంబరులో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉంటుందని, ఇది డిసెంబరు దాకా కొనసాగుతుందని వాతావరణ కేంద్రాలు చెప్పేస్తున్నాయి. జూన్‌లో మొదలైన ఎల్‌నినో ప్రభావం అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో తీవ్రంగా ఉండనుందని.. వచ్చే ఏడాది మార్చి దాకా కొనసాగుతుందని జాతీయ సముద్ర సమాచార సేవల కేంద్రం.. ఇన్‌కాయిస్ కూడా హెచ్చరించింది. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల, వర్షపాతం తగ్గుతుందని విశ్లేషించారు. ఫలితంగా ఎల్‌నినో ప్రభావం కారణంగా అక్టోబరుతో ప్రారంభమై జనవరి దాకా సాగే యాసంగి సాగు పనులూ ప్రశ్నార్థకంగా మారాయని, రైతులు అప్రమత్తంగా ఉండాలని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. అక్కడక్కడ, అప్పుడప్పుడు భారీ వర్షాలు పడ్డా కూడా ఇవి సీజన్ మొత్తంపడే అవకాశంలేదని, అన్నదాతలు తొందరపడి నీటి అవసరం ఎక్కువుండే పంటలు వేయొద్దని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి, భూగర్భ జలాలు పడిపోతాయని, చెరువులు, కుంటలు, జలాశయాల్లో నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయని... ఇలాంటి పరిస్థితుల్లో నీటి వినియోగం ఎక్కువగా ఉండే వరి, చెరకు లాంటి పంటలు సాగుచేయొద్దని రైతులకు సూచిస్తున్నారు. చిరుధాన్యాలు, నూనెగింజల వంటి ఆరుతడి పంటలు సాగు చేయడం మేలని సూచిస్తున్నారు. బోరుబావుల కింద కూడా వరిసాగు చేయొద్దని ఇప్పటికే శాస్త్రవేత్తలతో పాటు ప్రభుత్వాలు కూడా అన్నదాతల్ని అప్రమత్తం చేశాయి. కూరగాయల పంటలు వేయాలని సూచించాయి. ఎల్‌నినో ప్రభావం పట్టణ ప్రాంతాలపై కూడా పడుతుందని ఆర్థిక, సామాజిక అధ్యయనాల కేంద్రం బాంబు పేల్చింది. ప్రతి రెండు నుంచి ఏడేళ్లకు ఒకసారి సంభవించే ఎల్‌నినో భారీ వర్షాలు, కరవులు, ఉష్ణ ప్రకోపం వంటి వాటిని ప్రేరేపిస్తుంది. జూన్ నెలకు సంబంధించి దేశంలో మొత్తం రుతుపవన వర్షాల లోటు దాదాపు 40శాతంగా నమోదైంది. మహారాష్ట్ర, గుజరాత్, తెలంగాణ వంటి అనేక ప్రాంతాలు 75 నుంచి 85శాతం వరకు లోటును ఎదుర్కొంటున్నాయి. ఈ సంవత్సరం వర్షపాత లోటు 60శాతం వరకు ఉంటుందని భారత వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ లోటు దేశ వ్యవసాయ రంగాన్ని, భూగర్భ జల నిల్వలను, నదులను, నీటిపారుదలను తీవ్రంగా ప్రభావితం చేసే అవకాశం ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాల్లో 1875-77లో దారుణమైన కరవు సంభవించడానికి ఎల్‌నినోయే కారణం. ఆ కరవు ఇండియా, చైనా, ఈజిప్ట్, మొరాకో, ఇథియోపియా, దక్షిణాఫ్రికా, బ్రెజిల్, కొలంబియా, వెనెజువెలా దేశాలపై తీవ్ర ప్రభావం చూపి, అయిదు కోట్లకంటే ఎక్కువమందిని బలిగొంది. భారత్‌లో అప్పుడు సుమారు 56 నుంచి 96 లక్షల మంది మరణించారు. ఇప్పుడు కూడా ఎల్‌నినో కరువుకు దారితీస్తుందనే హెచ్చరికలు వెలువడుతున్నాయి. ఎల్‌నినో మనదేశ ఆర్థిక వ్యవస్థకు గొడ్డలిపెట్టుగా పరిణమించింది. ఖరీఫ్ సాగు విస్తీర్ణం, ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గి ధరలు విపరీతంగా పెరుగుతాయి. రిటైల్ ద్రవ్యోల్బణం, టూవీలర్ల అమ్మకాలు, ట్రాక్టర్ల విక్రయాలు, ఖరీఫ్ నాట్లు, జలాశయాల నీటి నిల్వలు, అగ్రి ఉత్పత్తి, విద్యుత్ డిమాండ్, పరపతి వృద్ధిపై తీవ్ర ప్రభావం ఉంటుంది. సగటు వర్షపాతంలో మైనస్ 10.65 మేర లోటు నమోదవుతుంది. ఖరీఫ్ సాగు విస్తీర్ణం ఒకశాతం తగ్గుతుంది. ఆహార ఉత్పత్తి నాలుగు శాతం క్షీణిస్తుంది. ఆహార ద్రవ్యోల్బణం సగటున 60 బేసిస్ పాయింట్లు పెరుగుతుంది. ఎంఎస్‌ఎంఈలకు బ్యాంక్ లోన్లు దొరకడం కష్టమవుతుంది. దేశ మొత్తం స్థూల అదనపు విలువలో వ్యవసాయ రంగం వాటా 18 శాతంగా ఉంది. ఎల్ నినో సంవత్సరాల్లో అగ్రి జీవీఏ వృద్ధి దాదాపు ఆగిపోతుంది. జీవీఏ వృద్ధి రేటు 350 బేసిస్ పాయింట్లు తక్కువగా ఉంటుంది. గరిష్ట ఉష్ణోగ్రతలు 0.20 డిగ్రీలే పెరిగినప్పటికీ, కరెంటుకు డిమాండ్ భారీగా పెరుగుతుంది. సాధారణంగా వర్షాకాలంలో తక్కువ ఖర్చుతో లభ్యమయ్యే జలవిద్యుత్ ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుంది. కానీ ఎల్‌నినో కారణంగా ఇప్పుడు జలవిద్యుత్తుకు అవకాశాల్లేకుండా పోయాయి. దీంతో అనివార్యంగా థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని పెంచక తప్పదు. కానీ వానాకాలంలో బొగ్గును గనుల నుంచి వెలికితీయడం కూడా కష్టం. అయినా సరే తప్పనిసరి పరిస్థితుల్లో ఇప్పుడు అన్ని క్షేత్రస్థాయి ఇబ్బందుల్ని ఎదుర్కుంటూ బొగ్గు వెలికితీయక తప్పదు. అయితే ప్రస్తుతం బొగ్గు నిల్వలు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో లేవు. దీంతో అధిక ధర పెట్టి ఇంధన ఎక్స్ఛేంజ్ నుంచి కరెంట్ కొనాల్సిన పరిస్థితి. తద్వారా ఆ భారం మళ్లీ అంతిమంగా వినియోగదారులపై బదిలీ అవుతుంది. అప్పుడూ సామాన్యులకు భారం తప్పదు. ఇలా ఎల్‌నినో కారణంగా వచ్చే ప్రతి సమస్యనూ సామాన్యులు ప్రత్యక్షంగానో.. పరోక్షంగానో చవిచూడక తప్పదు.

# ఒకవైపు విమర్శలు.. మరోవైపు ప్రశంసలు..

ప్రభుత్వ భూములు, చెరువులు, పార్కులు, రోడ్లు, నాలాలపై ఆక్రమణలను తొలగించేందుకు ఏర్పాటు చేసిన హైడ్రా అనేక సవాళ్ల మధ్య రెండేండ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. ఈ కాలంలో భారీ స్థాయిలో ఆక్రమణలను తొలగించిన హైడ్రా 2,471.11 ఎకరాల భూమిని తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకువచ్చింది. ఈ భూముల విలువ దాదాపు రూ.1.20 లక్షల కోట్ల పై మాటే అని అధికారులు అంచనా వేస్తున్నారు. అత్యధికంగా 1,810 ఎకరాల ప్రభుత్వ భూమికి ఆక్రమణల నుంచి విముక్తి కల్పించింది. అలాగే, చెరువుల వద్ద ఆక్రమణలు తొలగించి 454.11 ఎకరాలను తిరిగి స్వాధీనం చేసుకుంది. 90.39 ఎకరాల పార్కు స్థలాలు, 62.11 ఎకరాల రోడ్లు, ఫుట్‌పాత్‌లు, పబ్లిక్ ఓపెన్ ప్లేస్ లకి సంబంధించి 26.31 ఎకరాలను కాపాడింది. నాలాలపై ఆక్రమణలను తొలగించి 25.37 ఎకరాలను స్వాధీనం చేసుకుంది. ఆక్రమణల తొలగింపులో భాగంగా రెండేండ్లలో 1,378 అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసింది.

**రెండో ఏడాదిలోనే అత్యధికం**

2024 జూన్ 27న ఫిల్మ్‌నగర్ కో-ఆపరేటివ్ సొసైటీ పరిధిలోని లోటస్ పాండ్ పార్కు స్థలాన్ని కబ్జా చేసి కంపౌండ్ వాల్ కట్టగా అప్పటి ఈవీడీఎం కమిషనర్‌గా ఉన్న రంగనాథ్ దాన్ని కూల్చివేయించారు. తర్వాత ఆక్రమణల పని పట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం జీహెచ్‌ఎంసీ ఈవీడీఎం విభాగాన్ని జూలై 19న హైడ్రాగా మారుస్తూ జీవో ఇచ్చింది. అప్పుడు మొదలైన హైడ్రా ప్రస్థానం అనేక విమర్శలు, ప్రశంసలు, వివాదాల మధ్య కొనసాగుతూనే ఉంది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, సెలబ్రెటీలు, బడాబాబులు ఇలా ఎవరు ఆక్రమణల వెనక ఉన్నా వదల్లేదు. మొదటి ఏడాదిలో 581 ఆక్రమణలను తొలగించి 499 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా..రెండో ఏడాదిలో 797 ఆక్రమణలు నేలమట్టం చేసి ఏకంగా 1972 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడింది. మొదటి ఏడాదిలో కాపాడిన భూమి విలువ సుమారు రూ. 30 వేల కోట్ల వరకు ఉండగా,రెండో ఏడాదిలో ఇది దాదాపు లక్ష కోట్లకు చేరింది.

**చెరువులకు జీవం**

చెరువుల వద్ద ఆక్రమణలు తొలగించడమే కాకుండా ఆయా చెరువుల అభివృద్ధిని కూడా హైడ్రా చేస్తోంది. ఇందులో భాగంగా మొదటి దశలో 6 చెరువులను డెవలప్‌చేయగా, ఇప్పటికే బతుకమ్మకుంట, కూకట్ పల్లి నల్ల చెరువు, బమ్రుక్ ఉద్దౌలా చెరువులు అందుబాటులోకి వచ్చాయి. మరో మూడు చెరువుల పనులు ఫైనల్‌దశలో ఉన్నాయి. రెండో విడతలో 14 చెరువుల పనులను కూడా హైడ్రా చేపట్టింది. వీటికి తోడు క్యూర్ పరిధిలో నలుదిక్కుల 4 చెరువులను మినీ ట్యాంక్ బండ్లుగా డెవలప్‌చేయాలని రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను ఆదేశించింది. ఈ మేరకు రూ.227.98 కోట్ల పరిపాలనా అనుమతులు కూడా మంజూరు చేసింది. ఈ నిధులతో ఫాక్స్ సాగర్, అమీన్‌పూర్ చెరువు, అంబర్ చెరువు, సరూర్‌నగర్ చెరువుల్లో అభివృద్ధి పనులను హైడ్రా చేపట్టనుంది.

**బతుకమ్మ కుంటపై హైకోర్టులోనే తేల్చుకోండి : సుప్రీంకోర్టు**

న్యూఢిల్లీ, వెలుగు: అంబర్ పేట్ లోని బతుకమ్మ కుంట చెరువు వివాదంపై హైకోర్టులోనే తేల్చుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బతుకమ్మ కుంట ఫెన్సింగ్ పై హైడ్రా చెబుతోన్న అంశాలను పరిశీలించాలని హైకోర్టుకు సూచించింది. కుంట వివాదంలో హైడ్రా చేపట్టిన చర్యలపై స్టేటస్ కో మెయింటెన్ చేయాలని గతంలో హైకోర్టు ఆదేశించింది. ఈ ఆర్డర్ ను పట్టించుకోకుండా హైడ్రా.. చుట్టు పక్కల క్లీన్ చేసి, బ్యూటిఫికేషన్ పేరుతో ప్రహరీ, సుందరీకరణ పనులు చేసిందంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ పై సుదర్శన్ అనే వ్యక్తి కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం.. సుందరీకరణ చర్యలు తొలగించి, యథాస్థితిని కొనసాగించాలని ఆదేశించింది. దీన్ని సవాల్ చేస్తూ.. హైడ్రా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు ఆదేశాల అమలుపై రిపోర్ట్ దాఖలు చేశారు. ఈ కేసు శుక్రవారం మరోసారి సుప్రీంకోర్టులో విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. ఈ కేసు వ్యవహారంలో హైకోర్టుకే పూర్తి స్థాయి అవగాహన ఉందని అభిప్రాయపడింది. అందువల్ల మిగతా అంశాలపై అక్కడే తేల్చుకోవాలని సూచిస్తూ విచారణ ముగించింది.

**సవాల్ గా మారిన కోర్టు కేసులు**



హైడ్రా చర్యలకు వ్యతిరేకంగా ఇప్పటివరకు కోర్టుల్లో పెద్ద సంఖ్యలో దాదాపు 1200 వరకు పిటిషన్లు దాఖలయ్యాయి. ఇందులో 900 కేసులు డిస్పోజ్ కాగా, మిగతా వాటిపై విచాణ కొనసాగుతోంది. భూవివాదాలు, యాజమాన్య హక్కులు, కూల్చివేతల చట్టబద్ధత వంటి అంశాలపై న్యాయపరమైన పోరాటం కొనసాగుతోంది. ఈ కోర్టు కేసులు హైడ్రా కు సవాల్‌గా మారాయి. కొన్నిసార్లు కోర్టు ఆదేశాలను పాటించడం లేదన్న విమర్శలు కూడా హైడ్రాపై వచ్చాయి.

**మూడో ఏడాది చెరువుల డెవలప్ మెంట్‌పైనే ఫోకస్**

రెండేండ్లలో ఆక్రమణలు తొలగించడంతో చెరువుల అభివృద్ధి కూడా చేపట్టాం. ఇప్పటికే ఆరు చెరువుల పనులు పూర్తయ్యాయి. మూడో ఏడాది 14 చెరువులను అభివృద్ధి చేస్తాం. దీనికి తోడు మరో నాలుగు చెరువులను మినీ ట్యాంక్ బండ్ల మాదిరి డెవలప్ చేస్తాం. ఎల్‌నినో పరిస్థితులతో ప్రస్తుతం నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉంది. ఇటువంటి పరిస్థితులు భవిష్యత్‌లో రాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. వర్షాలు పడినప్పుడు నీటిని నిల్వ చేస్తే గ్రౌండ్ వాటర్ బాగుటుంది. చెరువుల పునరుద్ధరణతో కూడా గ్రౌండ్ వాటర్ పెరిగే చాన్స్ ఉంది.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

# క్రెడిట్, డెబిట్ కార్డు సైజులో రేషన్ కార్డు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ లబ్ధిదారులకు చిన్నపాటి పుస్తకంపై ఉన్న నంబర్ ఆధారంగానే సరుకులు పంపిణీ చేస్తున్నారు. ఈ మేరకు వారు తమ ఇంటి సమీపంలోని దుకాణాలకు వెళ్లి కార్డు నంబర్ చెప్పిన తర్వాత బయోమెట్రిక్‌పై వేలిముద్రలు తీసుకుని కుటుంబంలో ఉన్న లబ్ధిదారులందరికీ కలిపి కోటాను అందజేస్తున్నారు. ఈ తరుణంలో గతంలో ఎన్నడూ లేని విధంగా త్వరలో స్మార్ట్‌కార్డు సైజులో రేషన్‌కార్డులను పంపిణీ చేసేందుకు పౌరసరఫరాల శాఖ చర్యలు తీసుకుంటోంది.

**క్రెడిట్ కార్డు మాదిరిగా..**

తెలంగాణ పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో కొత్తగా అందించనున్న రేషన్‌కార్డు.. బ్యాంకులకు సంబంధించిన క్రెడిట్, డెబిట్ కార్డు సైజులో ఉంటుందని అధికారులు చెబుతున్నారు. కార్డుపై క్యూఆర్ కోడ్‌ను ముద్రిస్తున్నారని, లబ్ధిదారులు రేషన్ దుకాణానికి వెళ్లి డీలర్‌కు కార్డు అందించిన తర్వాత ఈ-పాస్ యంత్రంపై దానిని స్కాన్ చేస్తే వివరాలు ప్రత్యక్షమవుతాయని తెలిపారు. కార్డును స్కాన్ చేసిన తర్వాత అందులో లబ్ధిదారుల వివరాలతోపాటు ఇప్పటివరకు తీసుకున్న బియ్యం, సరుకులు, ప్రస్తుతం తీసుకోవాల్సిన వివరాలన్నీ కనిపిస్తాయని చెప్పారు. కార్డు ఏ మాత్రం చిరిగిపోకుండా, నీటిలో తడిచినా పాడవకుండా ఉండే విధంగా రూపొందిస్తున్నారన్నారు. వాస్తవంగా ఇప్పటివరకు లబ్ధిదారులకు సరైన కార్డులు లేకపోవడంతో మీసేవా ద్వారా పొందిన పేపర్‌ను మాత్రమే తీసుకుని దుకాణాలకు వెళ్లి అందులో ఉన్న నంబరును ఈ-పాస్ యంత్రంపై నమోదు చేసుకుని బియ్యం పొందుతున్నారని, పేపర్ చిరిగిపోవడంతోపాటు పలు సందర్భాల్లో నంబరు కనిపించక డీలర్లు, నిరక్షరాస్యులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో జేబు పాకెట్‌లో పెట్టుకునే విధంగా చిన్న సైజులో క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్‌కార్డును అందించేందుకు పౌరసరఫరాలశాఖ చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఇదిలా ఉండగా, స్మార్ట్‌కార్డుపై కుటుంబ యజమాని పేరు, చిరునామా ఉండడంతోపాటు తెలంగాణ ముఖ్యమంత్రి, రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి ఫొటో ఉండనుందని తెలుస్తోంది. వచ్చేనెలలో కొత్త కార్డుల పంపిణీ చేసే అవకాశం ఉందని సమాచారం.




# లీకేజీ పై కేంద్రం నిర్లక్ష్యం

**యాదాద్రి భువనగిరి,ఫ్లాష్ ఇండియా :** నీట్ ప్రవేశ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై తెలంగాణ రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. శుక్రవారం భువనగిరిలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతో కలిసి విలేకరులతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్రం చెలగాటమాడుతోందని ఆరోపించారు. నీట్ పరీక్షల అవకతవకల వల్ల ఎంతోమంది విద్యార్థులు తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నా కేంద్ర ప్రభుత్వానికి పట్టింపు లేకపోవడం విచారకరమన్నారు. గత 12 ఏళ్ల పాలనలో దాదాపు 152 సార్లు వివిధ పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని, ఎన్డీయే ప్రభుత్వం మాటలకే పరిమితమై చేతల్లో తీవ్ర వైఫల్యం చెందిందని ధ్వజమెత్తారు. ఈ ఘోర వైఫల్యానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని, విద్యార్థులకు ప్రధాని నరేంద్ర మోదీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం నిస్వార్థంగా పోరాడుతున్న ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇతర నాయకులను అరెస్టు చేయడాన్ని, ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. గతంలో యూపీఏ ప్రభుత్వ హయాంలో చిన్న ఆరోపణ రాగానే మంత్రులు రాజీనామాలు చేసిన విషయాన్ని గుర్తు చేసిన ఆయన, కేంద్ర ప్రభుత్వం కంటితుడుపు చర్యలు ఆపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

# పేపర్ లీక్ చేస్తే దబిడిదిబిడే..

## కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం..



**న్యూ ఢిల్లీ :** నీట్ పరీక్షల లీకేజీల వ్యవహారంపై విద్యార్థుల ఆగ్రహజ్వాలలు ఎగిసిపడుతున్న వేళ, కేంద్ర ప్రభుత్వం పేపర్ లీకేజీలు, కాపీయింగ్ రాయుళ్లపై ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమైంది. దేశవ్యాప్తంగా యువతలో రేగుతున్న నిరసనల సెగను గ్రహించిన ప్రధాని నరేంద్ర మోడీ, ఈ వ్యవహారంపై ఆలస్యంగానైనా కఠిన చర్యలకు శ్రీకారం చుట్టారు. అర్ధరాత్రి వేళ విడుదల చేసిన ఓ భావోద్వేగ వీడియో సందేశంలో ఆయన విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం అమలులో ఉన్న 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్ ఫెయిర్ మీన్స్) యాక్ట్, 2024' చట్టానికి మరింత పదను పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. శుక్రవారం మధ్యాహ్నం జరగనున్న కేంద్ర క్యాబినెట్ సమావేశంలో ఈ చట్ట సవరణలకు ఆమోదముద్ర పడే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ప్రతిపాదిత మార్పుల్లో ప్రధానంగా పేపర్ లీకేజీ కేసుల విచారణను వేగవంతం చేసేందుకు 'ఫాస్ట్ ట్రాక్ కోర్టులను' ఏర్పాటు చేసే నిబంధనను చేర్చనున్నారు. ఇప్పటికే ఢిల్లీ హైకోర్టు ఇటువంటి కేసుల విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టును ప్రకటించగా, దానికి అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇవే కాకుండా, లీకేజీలకు పాల్పడే వారికి విధించే జైలు శిక్షతో పాటు భారీగా జరిమానాలను సైతం పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం ఉన్న చట్టం ప్రకారం పేపర్ లీక్ కేసుల్లో దోషులకు 3 నుంచి 5 ఏళ్ల జైలు శిక్షతో పాటు పది లక్షల రూపాయల వరకు జరిమానా విధిస్తున్నారు. అలాగే లీకేజీల సమాచారాన్ని అధికారులకు చెప్పకుండా దాచిపెట్టే సేవా నిర్వాహకులకు కోటి రూపాయల వరకు జరిమానా విధించే వెసులుబాటు ఉంది. ఇది ఒకవేళ వ్యవస్థీకృత నేరంగా తేలితే శిక్షను 5 నుంచి 10 ఏళ్లకు పెంచడంతో పాటు కనీసం రూ. 10 కోట్ల వరకు జరిమానా విధించే నిబంధనలు ఉన్నాయి. ఇప్పుడు రాబోయే సవరణలతో ఈ శిక్షలు మరింత కఠినతరం కానున్నాయి. క్యాబినెట్ ఆమోదం పొందిన వెంటనే, పార్లమెంట్ రెండో వారం ప్రారంభమయ్యే సోమవారం రోజే ఈ 'సవరణ బిల్లు'ను లోక్‌సభలో ప్రవేశపెట్టాలని కేంద్రం భావిస్తోంది. మరోవైపు ఈ అంశంపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నాయి. గత పదేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా దాదాపు 150కి పైగా పేపర్ లీకేజీలు జరిగినా, ఒక్కరికి కూడా శిక్ష పడలేదని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఘాటుగా విమర్శించారు. మోడీ వీడియో సందేశంపై స్పందిస్తూ, లీకేజీల బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారని మరోసారి స్పష్టం చేశారు. అయితే ప్రధాని మోడీ మాత్రం తన వీడియోలో విద్యార్థుల ఆవేదనను ప్రస్తావిస్తూ లీకేజీ అనేది మామూలు విషయం కాదని, అది లక్షలాది మంది విద్యార్థులు, వారి కుటుంబాలకు ఎంతో గుండెకోతను మిగులుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే గత రెండున్నర నెలలుగా కఠిన చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే నిందితులను అరెస్ట్ చేసి జైలుకు పంపామని తెలిపారు. విద్యార్థుల ఒక విద్యా సంవత్సరం వృథా కాకుండా చూడడమే తమ ప్రాథమిక బాధ్యత అని, అందుకే వెంటనే పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. కనీసం 22 లక్షల మంది విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా పరీక్షలు నిర్వహించడానికి ప్రభుత్వం తన శక్తియుక్తులన్నీ ఉపయోగించిందని మోడీ వెల్లడించారు. శాఖాపరమైన ఆమోదాలు, అర్ధరాత్రి వరకు సాగిన చర్చల అనంతరం సిద్ధమైన ఈ బిల్లును క్యాబినెట్ మంత్రుల సూచనల మేరకు తుది రూపానికి తెచ్చి, సోమవారం నుంచే పార్లమెంట్‌లో ఆమోదింపజేసేందుకు గట్టిగా ప్రయత్నిస్తామని ప్రధాని పునరుద్ఘాటించారు.

# స్పష్టం చేసిన కేంద్రం..!

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయరు..

**న్యూ ఢిల్లీ :** నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) డిమాండ్ చేస్తోంది. రాజీనామా చేస్తేనే ఉద్యమం ఆపుతామని హెచ్చరిస్తోంది. మరోవైపు, ప్రతిపక్ష పార్టీలు కూడా ఆయన రాజీనామాను కోరుతున్నారు. అప్పుడే పార్లమెంట్‌లో చర్చిస్తామని చెబుతున్నారు. మరోవైపు, సీజేపీ ఈ రోజు కేంద్రంతో జరిగిన చర్చల్లో ధర్మేంద్ ప్రధాన్ రాజీనామాపై తగ్గేదే లేదని చెప్పింది. కేంద్రం దీనిపై రేపటి వరకు సమయం కోరింది. ఇదిలా ఉంటే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయబోరని ప్రభుత్వం స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం.. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయరని, దీనిని సమస్యకు పరిష్కారంగా ప్రభుత్వం పరిగణించడం లేదని, రాజీనామా చేసి బాధ్యతల నుంచి పారిపోవడం వంటిదని కేంద్ర భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజలు ప్రభుత్వానికి అధికారాన్ని అప్పగించారు, ప్రభుత్వం తన బాధ్యత నెరవేర్చే వ్యవస్థను మెరుగుపరుస్తుందని కేంద్రం భావిస్తోంది. బీజేపీతో పాటు, కేంద్రం ధర్మేంద్ర ప్రధాన్‌కు అండగా నిలుస్తున్నట్లు సమాచారం. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ)లోని లోపాలు, సమస్యలను గుర్తిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. వీటిపై ఒక సవివరమైన జాబితాను సిద్ధం చేస్తోందని, సమస్యల పరిష్కరించడానికి త్వరలో అవసరమైన చర్యలు తీసుకుంటుందని తెలుస్తోంది. పేపర్ లీక్ ప్రమేయం ఉన్న ముఠాలను ఇప్పటికే పట్టుకున్నారు. దర్యాప్తు సంస్థలు తమ దర్యాప్తును వేగవంతం చేశాయి. రాబోయే రోజుల్లో ఈ మాఫియా నెట్వర్క్‌పై కేంద్రం ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమైంది. రాజీనామాల రాజకీయాలపై కాకుండా, దేశ పరీక్షా వ్యవస్థను పారదర్శకంగా, విశ్వసనీయంగా మార్చడంపైనే తమ దృష్టి ఉందని ప్రభుత్వం పేర్కొంది.

# పట్టాలెక్కనున్న మూసీ ప్రాజెక్టు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టుపై సర్కార్ సీరియస్‌గా దృష్టి సారించింది. ఎట్టి పరిస్థితిలోనూ వచ్చు నెల మొదటి వారంలో మొదటి దశకు టెండర్లు పిలవడానికి సన్నాహాలు చేస్తోంది. అయితే రూ.4,500 కోట్ల రుణానికి ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ) క్లియరెన్స్ రాగానే టెండర్లు పిలిచేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించినట్టు తెలిసింది. దీంతోపాటు మొదటి దశ డీపీఆర్‌ను పరిశీలించడానికి ఏడీబీ ప్రతినిధులు ఈ నెల 21వ తేదీన హైదరాబాద్‌కు వచ్చారు. నేటితో పరిశీలన పూర్తికానుందని అధికారులు చెబుతున్నారు. ఇదే చివరి పరిశీలనతోపాటు వారం రోజుల్లో లోన్ క్లియరెన్స్ వచ్చే అవకాశముందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**మొదటి దశ 21 కి.మీ..**

హైదరాబాద్ మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టులో భాగంగా ఫేజ్ -1లో గాంధీ సరోవర్ వరకు 21 కిలోమీటర్ల మేరకు పూర్తి చేయడానికి రూ.7,345 కోట్లకు మంత్రిమండలి పరిపాలనా అనుమతులను మంజూరు చేయడంతోపాటు ప్రభుత్వం ఉత్తర్వులు సైతం జారీ చేసింది. ఉస్మాన్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 11.8 కి.మీ, హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 9.2 కి.మీ మార్గాల్లో ఇండ్ల నష్టం తగ్గించే విధంగా ప్రణాళికల్లో మార్పులు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు అభివృద్ధి భూసేకరణ, హిమాయత్ సాగర్ బండ్ బలోపేతం, ఎకో ప్రాజెక్టు పనులను చేపట్టనున్నారు. ఉస్మాన్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు విస్తరణ, రక్షణశాఖకు సంబంధించిన భూములను సేకరించే కార్యక్రమాలపై ప్రభుత్వం ఫోకస్ పెట్టాలని నిర్ణయించింది. దీంతోపాటు ఏడీబీ లోన్ కోసం ప్రత్యేకంగా 'ఎస్క్రో అకౌంట్' క్రియేట్ చేయడానికి ఎంఆర్డీసీఎల్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే బ్యాంకు అధికారులతో చర్చించారు. మొదటి దశ ప్రాజెక్టు టెండర్ ప్రక్రియకు సంబంధించిన పేపర్ వర్క్ పూర్తిచేసినట్టు సమాచారం. మొదటి దశ టెండర్ పనులు, రెండో దశ ప్రాజెక్టు డీపీఆర్ పనులను ఏకకాలంలో పూర్తి చేయడానికి కసరత్తు చేస్తున్నారు.

**లోన్ క్లియరెన్సే తరువాయి..**

మూసీ మొదటి దశ ప్రాజెక్టు డీపీఆర్‌ను మరోసారి పరిశీలించడానికి ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు(ఏడీబీ) అధికారులు ఈ నెల 21వ తేదీన హైదరాబాద్‌కు వచ్చారు. నేటితో ఈ బృందం పర్యటన పూర్తికానుంది. మూసీ ప్రాజెక్టు పూర్వపరాలను పరిశీలించడానికి, అధికారులతో చర్చించడానికి ఏడీబీ అధికారులు ఆరు సార్లు విజిట్ చేశారు. ఈ నెలలో నాలుగు రోజులపాటు చేసిన పరిశీలనే చివరిదికానుందని తెలుస్తోంది. ఈ పరిశీలన తర్వాత లోన్ క్లియరెన్స్ ఇవ్వడమే తరువాయిగా మిగిలింది.

**భాగస్వామ్య శాఖలతో..**

మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టు విషయంలో ఎంఆర్డీసీఎల్ అధికారులు, మెయిన్ హర్డ్ ఏజెన్సీ రూపొందించిన డీపీఆర్‌ను పరిశీలించడంతోపాటు మూసీ ప్రాజెక్టుతో అనుసంధానం ఉన్న భాగస్వామ్య శాఖలతోనూ ఏడీబీ అధికారులు చర్చించారు. గురువారం అన్ని భాగస్వామ్య శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీ, జలమండలి, పీసీబీ, నీటిపారుదల శాఖల అధికారులతో ఏడీబీ ప్రతినిధులు చర్చించారు. మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టుకు భాగస్వామ్య శాఖలు అంగీకరించారా? లేదా? ఏమైనా అభ్యంతరాలు ఉన్నాయా? ఉంటే ఇప్పుడు చెప్పాలని ఏడీబీ ప్రతినిధులు కోరినట్టు తెలిసింది. అన్ని శాఖలు అంగీకారం తెలిపినట్టు సమాచారం. మొదటి దశ డీపీఆర్‌కు అన్ని శాఖల అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఏడీబీ ప్రతినిధులు సైతం సంతృప్తి వ్యక్తం చేసినట్టు విశ్వసనీయవర్గాల సమాచారం.

**క్లియరెన్స్ రాగానే టెండర్లు..**

మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టు మొదటి దశ డీపీఆర్, భాగస్వామ్య శాఖల అధికారుల సమావేశంపై సంతృప్తి వ్యక్తం చేసిన ఏడీబీ ప్రతినిధులు ఈనెలాఖరు వరకు రూ.4,500కోట్ల రుణానికి క్లియరెన్స్ ఇవ్వనున్నట్టు సమాచారం. ఏడీబీ నుంచి క్లియరెన్స్ రాగానే వచ్చేనెల మొదటి వారంలో ప్రాజెక్టుకు గ్లోబల్ టెండర్లు పిలిచే అవకాశమున్నట్టు తెలిసింది. దీంతోపాటు నాగోల్ నుంచి గౌరెల్లి వరకు రెండో దశ ప్రాజెక్టు డీపీఆర్ పై అధికారులు దృష్టి సారించనున్నారు.

# ఇందిరా పార్క్ వద్ద హైటెన్షన్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 'నీట్' పరీక్షల్లో జరిగిన అక్రమాలపై శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల లాఠీఛార్జ్‌ను ఖండిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆందోళన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్వీ నాయకులతో కలసి ధర్నా చేపట్టడానికి సిద్ధమయ్యారు. అయితే, ఈ ఆందోళనను అడ్డుకునేందుకు కాంగ్రెస్ పార్టీ రంగంలోకి దిగడంతో ఇందిరా పార్క్ పరిసర ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

**కాంగ్రెస్ ఆందోళన - పోలీస్ బందోబస్తు**

కాంగ్రెస్ మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ నాయకులు కేటీఆర్ నిరసనను అడ్డుకునేందుకు సమాయత్తమయ్యారు. ఆదర్శ్ నగర్‌లోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి ఇందిరా పార్క్‌కు ర్యాలీగా వెళ్లేందుకు వారు సిద్ధమయ్యారు. ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగే అవకాశం ఉందన్న సమాచారంతో, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు అక్కడ భారీగా మోహరించారు. కాంగ్రెస్ శ్రేణులను ముందుకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకునే యత్నం చేస్తున్నారు.

**కేటీఆర్ క్షమాపణ చెప్పాల్సిందే..**

ఈ సందర్భంగా మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఓ విద్యార్థిని మరణంపై కేటీఆర్ అత్యంత అనుచితంగా మాట్లాడారని ఆరోపించారు. సమస్య తీవ్రతను పక్కనపెట్టి, సదరు అమ్మాయి లవ్ ఎఫైర్ వల్లే చనిపోయిందంటూ కేటీఆర్ ఎద్దేవా చేయడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో ప్రజలు, విద్యార్థులు తమ హక్కుల కోసం ఆందోళనలు చేయకుండా 'ధర్నా చౌక్'ను ఎత్తివేశారని గుర్తుచేశారు. నేడు అదే ధర్నా చౌక్‌లో కేటీఆర్ రాజకీయ స్వార్థం కోసం నిరసనలు తెలపడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. విద్యార్థులపై లాఠీఛార్జ్ జరిగి నాలుగు రోజులు గడుస్తున్నా పట్టించుకోని కేటీఆర్, ఇప్పుడు స్వార్థ ప్రయోజనాల కోసమే ఇందిరా పార్క్ వద్ద ధర్నాకు దిగుతున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రజలకు, విద్యార్థులకు కేటీఆర్ బహిరంగంగా క్షమాపణ చెప్పిన తర్వాతే ధర్నా చౌక్‌లో అడుగుపెట్టాలని అంజన్ కుమార్ యాదవ్ వార్నింగ్ ఇచ్చారు.

# కేంద్రానికి ఎదురుదెబ్బ

## జంతర్ మంతర్ వద్ద ఇంటర్నెట్ నిలిపివేత..

**న్యూ ఢిల్లీ :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ ఆందోళనలు, తదనంతర పరిణామాలపై ఢిల్లీ హైకోర్టులో శుక్రవారం రెండు కీలక పిటిషన్లు చర్చనీయాంశంగా మారాయి. నీట్ నిరసనలపై ఎన్ఐఏ విచారణ కోరిన పిటిషన్‌ను విచారించేందుకు కోర్టు నిరాకరించగా, జంతర్ మంతర్ వద్ద ఇంటర్నెట్ నిలిపివేతను సవాల్ చేస్తూ మరొక పిటిషన్ దాఖలైంది. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ తేజస్ కారియాలతో కూడిన ధర్మాసనం ఈ అంశాలను పరిశీలించింది. జూలై 20న నిర్వహించిన 'సంసద్ చలో' మార్చ్ వెనుక విదేశీ నిధులు, రాజకీయ కుట్రలు ఉన్నాయని, దీనిపై జాతీయ దర్యాప్తు సంస్థ చేత విచారణ జరిపించాలని అఖిల భారత హిందూ మహాసభ మాజీ ఉపాధ్యక్షుడు సతీష్ కుమార్ అగర్వాల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై స్పందించిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్ఐఏ చట్టం ప్రకారం కేసును బదిలీ చేయాలా వద్దా అనేది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని, కేంద్ర సంతృప్తికి బదులుగా కోర్టులు తమ అభిప్రాయాన్ని భర్తీ చేయలేవని స్పష్టం చేసింది. ఎన్ఐఏ కేవలం ఒక దర్యాప్తు సంస్థ మాత్రమే తప్ప సాధారణ విచారణలకు వినియోగించేది కాదని పేర్కొంది. న్యాయస్థానం వైఖరిని గమనించిన పిటిషనర్ తన పిటిషన్‌ను ఉపసంహరించుకోగా, హైకోర్టు దానికి అనుమతించింది.

**జంతర్ మంతర్ వద్ద ఇంటర్నెట్ నిలిపివేతపై హైకోర్టులో పిటిషన్**

మరొక వైపు, జంతర్ మంతర్ ప్రాంతంలో విద్యార్థులు నిర్వహిస్తున్న నిరసనల నేపథ్యంలో.. అక్కడ మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ 'సాఫ్ట్‌వేర్ ఫ్రీడమ్ లా సెంటర్, ఇండియా' హైకోర్టులో ప్రజా ప్రయోజన పిటిషన్ దాఖలు చేసింది. ఇంటర్నెట్ బంద్ విధించడం ఆర్టికల్ 19(1)(a) కింద పౌరులకు లభించిన భావప్రకటనా స్వేచ్ఛ, శాంతియుతంగా నిరసన తెలిపే హక్కులను ఉల్లంఘించడమేనని పిటిషనర్ పేర్కొన్నారు. టెలికమ్యూనికేషన్స్ చట్టం-2023, తాత్కాలిక సేవల నిలిపివేత నిబంధనలు-2024ను కేంద్రం పాటించలేదని ఆరోపించారు. 'అనురాధ బాసిన్' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఇంటర్నెట్ రద్దు ఉత్తర్వులను బహిరంగంగా ప్రచురించాల్సి ఉన్నప్పటికీ, ప్రభుత్వం



రహస్యంగా అమలు చేసిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

**ప్రధాన డిమాండ్లు..**

జంతర్ మంతర్, సెంట్రల్ ఢిల్లీ పరిసరాల్లో విధించిన ఇంటర్నెట్ నిలిపివేత ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలి. ఇంటర్నెట్ రద్దుకు సంబంధించిన అసలు రికార్డులు, ఇంటెలిజెన్స్ నివేదికలను కోర్టుకు సమర్పించాలి. భవిష్యత్తులో ఇంటర్నెట్ రద్దు ఉత్తర్వులను అమలు చేయడానికి ముందే లేదా అమలుతో పాటు బహిరంగంగా ప్రచురించేలా ఆదేశాలు జారీ చేయాలి.

## తలకొండపల్లిని 'హరిత గ్రామం'గా

# తీర్చిదిద్దుతాం



**తలకొండ పల్లి ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రంలో పచ్చదనాన్ని పెంపొందించే లక్ష్యంతో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఇంటింటికీ ఆరు చెట్లు పంపిణీ కార్యక్రమాన్ని శనివారం వైభవంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సర్పంచుల సంఘం తలకొండపల్లి మండల అధ్యక్షులు, గ్రామ సర్పంచ్ కటికెల శేఖర్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటే కార్యక్రమాన్ని సైతం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కటికెల శేఖర్ యాదవ్ మాట్లాడుతూ... వాతావరణంలో వస్తున్న మార్పులు, రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే పచ్చదనం ఎంతో అవ-సరమని పేర్కొన్నారు. తలకొండపల్లి ని సంపూర్ణ హరిత గ్రామంగా తీర్చిదిద్దడమే తమ ముఖ్య లక్ష్యమని, ఇందులో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద కనీసం ఒక చెట్టును నాటి, దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్: నూకం కోటేశ్వర్ ముదిరాజ్ పంచాయతీ కార్యదర్శి: సత్యం వార్డు సభ్యులు: జ్యోతి, కిషోర్, వెంకటేష్ యాదవ్, తిరుమని రవి గౌడ్, ఎరుకలి దశరథ్, మల్లేష్, నర్సింహా, వాసు, శ్రీను, చంద్రయ్య గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు



## మృతురాలి కుటుంబానికి వార్డు సభ్యుడు నరేష్ ఆర్థిక సహాయం అందజేత

**తలకొండ పల్లి ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం రాంపూర్ గ్రామ పరిధిలోని సంఘయపల్లి గ్రామంలో మానవత్వం పరిమళించింది. ఇటీవల అనారోగ్యంతో మరణించిన పంబ్బాల సాయమ్మ కుటుంబానికి స్థానిక 9వ వార్డు సభ్యుడు నరేష్ ఆర్థిక సహా-యం అందించి ఆదుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆ కుటుంబానికి 2,000 రూపాయల నగదును అందజేశారు. ఈ సందర్భంగా వార్డు సభ్యుడు నరేష్ మాట్లాడుతూ.. 9వ వార్డు పరిధిలో నిరుపేద కుటుంబాల్లో ఎవరైనా మరణిస్తే, వారి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం తన వంతు సహాయంగ ఆర్థిక సాయాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. విపత్కర పరిస్థితుల్లో పేదలను ఆదుకోవడానికి ఎల్లప్పుడూ ముందుంటానని తెలుపడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు జంగయ్య,నరసింహ,చెన్నయ్య, కేశవులు, లక్ష్మి నారాయణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# యువత స్వయంకృషితో ఉన్నత స్థాయికి ఎదగాలి

### నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ ఆర్ ఆర్ చాయ్ అడ్డ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేసిన రాఘవేందర్ గౌడ్



**తలకొండ పల్లి ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, స్వయంకృషితో వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి నూతన అవకాశాలను సృష్టించుకోవాలని, ఆర్థికంగా ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రముఖ బిజెపి యువ నాయకుడు తిర-ుమణి రాఘవేందర్ గౌడ్ పిలుపునిచ్చారు. నూతనంగా ముగ్గురు మిత్రులు చింతకాయల రాము. గుంత రవి. అయిలు ఆంజనేయులు గౌడ్ ఏర్పాటు చేసిన ఆర్ ఆర్ ఆర్ చాయ్ అడ్డ' ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రిబ్బన్ కట్ చేసి, ప్రాంగణాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం ఉపాధికి ప్రోత్సాహం: సొంతంగా వ్యాపారాన్ని ప్రారంభించి నలుగురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగడం అభినందనీయమని రాఘవేందర్ గౌడ్ కొనియాడారు. నేటి యువత కష్టపడే తత్వాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నమ్ముకొని వ్యాపార రంగంలో ముందుకు సాగాలని సూచించారు. ఆర్ ఆర్ ఆర్ చాయ్ అడ్డ' నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ సంస్థ వినియోగదారులకు నాణ్యమైన సేవలుందిస్తూ మంచి ఆదరణ పొందాలని, భవిష్యత్తులో మరిన్ని శాఖలను విస్తరించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, చింతకాయల రాము. గుంత రవి. అయిలు ఆంజనేయులు గౌడ్. మరియు యువకులు శరత్. వద్దె సాయి. తదితరులు పాల్గొన్నారు

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం..



**ఖమ్మం,ఫ్లాష్ ఇండియా :** రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన ఏదులాపురం మున్సిపాలిటీలో చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా చింతకాని మండలం నామవరం గ్రామానికి చెందిన వలిమల గోపినాథ్(25) గత సంవత్సరం నుంచి ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో గల ఆశోక్లేల్యాండ్ షోరూమ్ లో టెక్నిషియన్గా పనిచేస్తున్నాడు. గోపినాథ్ శుక్రవారం ఉదయం ఇంటి నుంచి డ్యూటీకి తన టూ వీలర్ పై వస్తుండగా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని బీలీఫ్ హస్పిటల్ సమీపంలోకి రాగానే వెనుకు నుంచి అతివేగంగా వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో గోపినాథ్ తన బైక్ పై నుంచి రోడ్డు మీద పడగానే వేగంగా వచ్చిన లారీ నడుము మీద నుంచి వెళ్లడంతో శరిరరం రెండు బాగాలుగా తెగిపడి అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ ముష్కరాజు సంఘటన స్థలానికి చెరుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ హస్పిటల్కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## మిర్యాలగూడలో విద్యాసంస్థల బంద్ విజయవంతం..




**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** విద్యార్థులపై జరిగిన పోలీసు దమనకాండ, ప్రజాస్వామ్య హక్కుల అణచివేతకు నిరసనగా మిర్యాలగూడ పట్టణంలో విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన విద్యా వ్యవస్థను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. లక్షలాది మంది విద్యార్థులు ఎన్నో సంవత్సరాల పాటు కష్టపడి పోటీ పరీక్షలకు సిద్ధమవుతుంటే, నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ ద్వారా వారి శ్రమ, ఆశలు, భవిష్యత్తుతో చెలగాట మాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ కుంభకోణం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి, పరీక్షల నిర్వహణలో నెలకొన్న అవినీతికి నిదర్శనమని అన్నారు. నీట్ పేపర్ లీక్పై చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో నిర్వహించిన చలో పార్లమెంట్" కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, యువజన సంఘాల నాయకులపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు బీజేపీ ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనమని విమర్శించారు. నీట్ పేపర్ లీక్, పోటీ పరీక్షల అక్రమాలు, విద్యా వ్యవస్థలో నెలకొన్న అవ్యవస్థ కారణంగా తీవ్ర మానసిక వేదనకు గురై ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 1 కోటి ఎక్స్గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. యువత భవిష్యత్తును చీకటిలోకి నెడుతూ, ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను దేశ ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. నీట్ పేపర్ లీక్ కుంభకోణంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యార్థులపై లాఠీచార్జికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, సోనమ్ వాంగ్చుక్ను వెంటనే విడుదల చేయాలని, బాధిత విద్యార్థుల కుటుంబాలకు రూ. 1 కోటి ఎక్స్గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జగన్ ప్రసన్న లోహి ఝాన్సీ జిల్లా నాయకులు యశ్వంత్ ఎంఎస్ యుఐ నాయకులు అజయ్ న్యూ మాన్ యశ్వంత్ కిరణ్ ఎస్ఎఫ్ఐ నాయకులు శివ బన్నీ రవి హనుమత్ సతీష్ మనోహర్ మణి తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీకేజీపై బీఎస్పీ నిరసన

### కేంద్ర ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు




**నల్లగొండ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** నీట్ పేపర్ లీకేజీ ఘటనపై కేంద్ర ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ, బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా శాంతియుత ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు. భావి భారత ప్రధానమంత్రి అక్క మా-యావతి పిలుపు మేరకు, బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రహీం శేఖర్ ఆదేశాల మేరకు ఈ నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన ఆందోళనకు సంఘీభావంగా తెలంగాణలోనూ పార్టీ శ్రేణులు నిరసనలు చేపట్టాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీ కారణంగా దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఈ ఘటనకు కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే నైతిక బాధ్యత స్వీకరించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా రాజీనామా చేయాలని కోరారు. పోటీ పరీక్షల పారదర్శకతను దెబ్బతీసే పేపర్ లీకేజీలు ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ విలువలకు తీవ్ర ముప్పుగా మారాయని పేర్కొన్నారు. విద్యార్థులకు పూర్తి న్యాయం జరిగే వరకు బహుజన సమాజ్ పార్టీ ప్రజా పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రావులపాటి రవిశంకర్, నల్గొండ పార్లమెంట్ ఇన్చార్జ్ వడ్డపాక యాదగిరి, మామిడి స్టాలిన్, భువనగిరి పార్లమెంట్ ఇన్చార్జ్ కత్తుల కాన్షీరామ్, కిరణ్, జిల్లా ఉపాధ్యక్షులు బాష్పాక శివ, నల్గొండ నియోజకవర్గ అధ్యక్షులు కంబాలపల్లి మధు, నకిరేకల్ నియోజకవర్గ ఇన్చార్జ్ శోభా, నకిరేకల్ నియోజకవర్గ అధ్యక్షులు గ్యార శేఖర్, నకిరేకల్ నాయకులు తాటిపాముల వెంకన్న, మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు సుభాష్, నియోజకవర్గ నాయకులు సుక్క రాములు, మిర్యాలగూడ నియోజకవర్గ ఇన్చార్జ్ దినేష్తో పాటు వివిధ నియోజకవర్గాలు, మండలాలు, సెక్టార్లు, బూత్ స్థాయి నాయకులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు





**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** దామరచర్ల,అడవిదేవులపల్లి మండల కేంద్రాలలో దామరచర్ల, అడవిదేవులపల్లి మండలాల కి చెందిన సర్పంచ్లు,బూత్ లెవల్ ఏజెంట్లు (బి ఎల్ ఎలు)తో వారి మండల కేంద్రములో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను అత్యంత బాధ్యతాయుతంగా చేపట్టి, దామరచర్ల,అడవిదేవులపల్లి మండలంలోని ప్రతి గ్రామంలో 100 శాతం పూర్తి చేసేలా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. ఓటర్ల నమోదు,మా-ర్పులు, చేర్పులు,తొలగింపుల ప్రక్రియలో ఎలాంటి అర్హులైన ఓటరు కూడా మిస్ కాకుండా ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని,ప్రతి బీఎల్ఏ తమకు కేటాయించిన బూత్ పరిధిలో పూర్తి స్థాయిలో పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని,ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా సర్పంచ్లు,పార్టీ నాయకులు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచ్లు,బీఎల్ఏలు, ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై అంగన్వాడి కార్యకర్తలు,బిఎల్ఓ ల నిరసన



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఇటీవల కొడంగల్లో జరిగిన ఒక సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఎల్ఓల పట్ల అనుచితంగా మాట్లాడడాన్ని అంగన్వాడీ కార్యకర్తలు,బీఎల్ఓలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తాము మహిళలమై ఉండి ఎన్నో బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తున్నా తమను అవమానించేలా మాట్లాడటం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యల పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ శుక్రవారం నల్గొండ ఆర్డీవో కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జి లు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నిరసనకారులు మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అంగన్వాడీ కేంద్రాలను నిర్వహిస్తూ మాతాశిశు సంరక్షణలో భాగంగా పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని తెలిపారు. దీనితో పాటు ప్రభుత్వానికి సంబంధించిన రెండు వేర్వేరు మొబైల్ యాప్లలో నిరంతరం డేటాను అప్లోడ్ చేస్తూ విధులను నిర్వర్తిస్తున్నామని గుర్తు చేశారు. ఇంత కష్టపడి పనిచేస్తున్నప్పటికీ,ముఖ్యమంత్రి,మంత్రి బీఎల్ఓలు బాధ్యతలు సక్రమంగా నిర్వహించడం లేదని,కేవలం జీతాలు,సంక్షేమ పథకాలు తీసుకుంటూ నిర్లక్ష్యం వహిస్తున్నారని మాట్లాడటం తమను తీవ్రంగా గాయపరిచిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెద్దలు తమపై చేసిన ఆరోపణలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో అంగన్ వాడి వర్కర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు జివి రమణ, కార్యదర్శి సునీత,నాయకురాళ్లు శశికళ,పుష్పకళ,సరోజ,కదారి కవిత ,మౌనిక, రాములమ్మ,రాజ్యం,అరుణ,ఉష శ్రీ,గౌతమి తదితరులు పాల్గొన్నారు.

# గణితం ప్రత్యేకమైన సబ్జెక్ట్

**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** గణితం ప్రత్యేకమైన సబ్జెక్ట్ అని, ఈ విద్యా సంవత్సరంలో మాథ్స్లో ఒక్క విద్యార్థి కూడా ఫెయిల్ కాకుండా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. శుక్రవారం, జిల్లాలోని లింగాల ఘనపురం మండలంలోని నెల్లుట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సమగ్ర ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా సందర్శించి, పరిశీలించారు. ఆధునిక బోధన--అభ్యాసన పద్ధతులపై జరుగుతున్న శిక్షణలో పాల్గొన్న గణిత ఉపాధ్యాయులతో నేరుగా మాట్లాడి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు ఆల్జీబ్రా, లాగరిథమ్స్, పాలినామియల్ ఈక్వేషన్స్కు సంబంధించిన సమస్యలను ఇచ్చి, వాటి పరిష్కార విధానాన్ని వివరించాలని సూచించారు. గణితంలోని ప్రతి అంశాన్ని కేవలం సూత్రాలకే పరిమితం కాకుండా, విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునే విధంగా విజువలైజేషన్ (దృశ్యీకరణ) పద్ధతిలో బోధించాలని తెలిపారు. ఉపాధ్యాయులు ప్రతి అంశంపై సన్నద్ధమై తరగతి గదికి వస్తే బోధన నాణ్యత మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. అకాడమిక్ ఫ్రేమ్వర్క్ను తప్పనిసరిగా పాటిస్తూ ప్రణాళికాబద్ధంగా బోధన కొనసాగించాలని సూచించారు. ప్రతి 15 రోజులకు స్లిప్ టెస్టులు, మాక్ టెస్టులు నిర్వహించి, విద్యార్థుల అభ్యాస స్థాయిని నిరంతరం అంచనా వేయాలని ఆదేశించారు.




ఈసారి పదో తరగతి పరీక్షల్లో గణితంలో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని, ఒక్క విద్యార్థి కూడా ఫెయిల్ కాకుండా లక్ష్యంతో కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు."మీరు ఎలా బోధిస్తారో ఫలితాలు కూడా అలాగే వస్తాయి. విద్యార్థుల్లో బాగా చదివేవారు, వెనుకబడినవారు ఇద్దరూ ఉంటారు. ఉపాధ్యాయులు అదనపు శ్రద్ధ, ప్రత్యేక కృషి చూపితే ప్రతి విద్యార్థిని ఒకే స్థాయికి తీసుకురావచ్చు" అని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతిరోజూ ఫాస్ట్ మాథ్స్ పుస్తకంలోని అంశాలను తప్పనిసరిగా బోధించాలని, గణితంపై విద్యార్థుల్లో భయాన్ని తొలగించి, ఆసక్తిని పెంపొందించేలా సృజనాత్మక బోధనా విధానాలను అనుసరించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులతో కలెక్టర్ పలు గణిత అంశాలపై చర్చించి, నాణ్యమైన బోధన ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఉన్నత ఫలితాల దిశగా తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

# మెరిసిన తెలుగు కుర్రాడు




శ్రీలంక అండర్-19తో జరిగిన రెండో యూత్ టెస్టులో భారత్ అండర్-19 జట్టు 211 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. తొలి టెస్టు డ్రా అయిన విషయం తెలిసిందే. రెండో టెస్టులో నెగ్గడంతో సిరీస్‌ను కూడా భారత్ 1-0తో సొంతం చేసుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో 411 రన్స్ చేసిన ఇండియా.. శ్రీలంకను 148 పరుగులకే కూల్చేసి 263 పరుగుల భారీ లీడ్ సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో 208/3 వద్ద డిక్లేర్డ్ ఇచ్చి 472 పరుగుల భారీ లక్ష్యాన్ని శ్రీలంక ముందు పెట్టింది. గురువారం 155/4తో చేజింగ్‌ను కొనసాగించిన శ్రీలంక 260 పరుగులకే ఆలౌటైంది. ఆ జట్టులో విమత్ దిన్సారా(64), సెనుజ వెకునగోడ(64), సెనెవిరత్నె(42) రాణించగా.. భారత బౌలర్ల ధాటికి ఆ జట్టు ఏ దశలోనూ పోటీనివ్వలేకపోయింది. బౌలర్లు రోహిత్ యాదవ్ 4 వికెట్లు, చిగురపాటి వెంకట 3 వికెట్లు పడగొట్టి శ్రీలంక పతనాన్ని శాసించారు. చిగురపాటి వెంకటది ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణ జిల్లా. అయితే అతను దేశవాళీలో గోవాకు ఆడుతున్నాడు.

# ఎట్టకేలకు తొలి విజయం



భారత టీ20 కొత్త కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు బిగ్ రిలీఫ్ దక్కింది. తన కెప్టెన్సీలో ఎట్టకేలకు తొలి విజయాన్ని నమోదు చేసుకున్నాడు అయ్యర్. హరారే వేదికగా భారత్, జింబాబ్వే వేదికగా గురువారం మ్యాచ్ జరిగింది. అయితే ఇందులో జింబాబ్వే మొదట బ్యాటింగ్ చేసి 125 పరుగులు చేయగా.. ఆ లక్ష్యాన్ని అవలీలగా ఛేదించింది భారత్. 13.2 ఓవర్లలోనే మ్యాచ్ ఫినిష్ చేసి... సిరీస్ లో లీడ్ లోకి వచ్చింది. ఇక ఈ మ్యాచ్ లో 15 ఏళ్ల కుర్రాడు వైభవ్ 50 పరుగులు చేయగా... ఇషాన్ కిషన్ 35 పరుగులతో రాణించారు. చివరలో కెప్టెన్ శ్రేయస్ 28 పరుగులు చేసి మ్యాచ్ గెలిపించాడు. దీంతో జింబాబ్వే పై ఏడు వికెట్ల తేడాతో విజయాన్ని నమోదు చేసుకుంది భారత్. ఈ విజయంతో భారత్ 1-0 లీడ్ సంపాదించింది. ఇక భారత్, జింబాబ్వే జట్ల మధ్య మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి.



# 7 మ్యాచ్‌ల నిరీక్షణకు తెర..

జింబాబ్వే పర్యటనను టీమిండియా ఘన విజయంతో ప్రారంభించింది. గురువారం హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగిన తొలి టీ20లో భారత్ 7 వికెట్ల తేడాతో ఆతిథ్య జట్టును ఓడించి మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది. ఈ విజయం భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు వ్యక్తిగతంగా కూడా కలిసొచ్చింది. సర్పంచ్ సాబ్ కెప్టెన్సీ చేపట్టాక వరుస పరాజయాలు వెంటాడగా.. ఈ విజయం అతడికి భారీ ఊరటను ఇచ్చింది.టీ20 కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత శ్రే-యస్ అయ్యర్ తొలి ఏడు మ్యాచ్‌ల్లో ఒక్క విజయం కూడా అందుకోలేదు. ఐర్లాండ్‌తో జరిగిన సిరీస్‌లో భారత్ 2-0తో ఓడిపోగా.. ఇంగ్లండ్‌తో జరిగిన సిరీస్‌లో 4-0తో పరాజయం పాలైంది. మరో మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. మొత్తం ఏడు మ్యాచ్‌ల్లో ఆరు ఓటములు, ఒక మ్యాచ్ ఫలితం లేకుండా ముగియడంతో.. భారత జట్టు టీ20 చరిత్రలోనే అత్యంత సుదీర్ఘ విజయరహిత పరంపరను నమోదు చేసింది. అయితే జింబాబ్వేపై విజయం సాధించడం ద్వారా ఆ చెత్త రికార్డుకు బ్రేక్ పడింది.అంతేకాదు శ్రేయస్ అయ్యర్ మరో చెత్త రికార్డు నుంచి కూడా విముక్తి పొందాడు. అంతర్జాతీయ టీ20ల్లో వరుసగా ఏడు టాస్‌లు గెలిచి కూడా.. ఒక్క మ్యాచ్ గెలవని కెప్టెన్‌గా సర్పంచ్ సాబ్ నిలిచాడు. ఈ చెత్త రికార్డు జాబితాలో బల్గేరియా మాజీ కెప్టెన్ ప్రకాశ్ మిశ్రా (ఏడు మ్యాచ్) తో కలిసి శ్రేయస్ సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నాడు. ఇప్పుడు జింబాబ్వేపై విజయం సాధించడంతో ఆ అపజయ పరంపరకు కూడా బ్రేక్ పడింది. అర్జెంటీనాకు చెందిన హెర్నాన్ ఫెన్నెల్ ఆరు మ్యాచ్‌లతో తర్వాతి స్థానంలో ఉన్నాడు.

జింబాబ్వేతో జరిగిన తొలి టీ20లో భారత్ అన్ని విభాగాల్లో ఆధిపత్యం చెలాయించింది. ముందుగా బౌలర్లు జింబాబ్వేను 125/7కే పరిమితం చేశారు. అనంతరం 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ 18 బంతుల్లోనే అర్ధశతకం బాదడంతో భారత్ లక్ష్యాన్ని 13.2 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఈ విజయంతో శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో టీమిండియా కొత్త ఆరంభం చేసింది. వరుస పరాజయాల తర్వాత వచ్చిన ఈ విజయం జట్టుకు మాత్రమే కాకుండా కెప్టెన్‌గా అయ్యర్‌కు కూడా ఎంతో ఆత్మవిశ్వాసాన్ని అందించింది. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లోనూ అదే జోరును కొనసాగించి సిరీస్‌ను కైవసం చేసుకోవాలని భారత్ చూస్తోంది.

# ఎంఎస్ ధోనీ రికార్డు బద్దలు..





టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అరుదైన ప్రపంచ రికార్డును ఖాతాలో వే-సుకున్నాడు. పురుషుల అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో కెప్టెన్‌గా వరుసగా అత్యధికసార్లు టాస్ గెలిచిన కెప్టెన్‌గా రికార్డుల్లో నిలిచాడు. తొలి ఎనిమిది మ్యాచ్‌ల్లో టాస్ గెలిచిన ప్రపంచంలోనే తొలి కెప్టెన్‌గా సర్పంచ్ సాబ్ రికార్డుల్లోకి ఎక్కాడు. గురువారం జింబాబ్వేతో హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో టాస్ గెలవడంతో శ్రేయస్ ఖాతాలో ఈ సరికొత్త చరిత్ర సృష్టించాడు. టీ20 ఫార్మాట్ ప్రారంభమైనప్పటి నుంచి ఏ సారథి కూడా తన తొలి ఎనిమిది మ్యాచ్‌ల్లో వరుసగా టాస్ గెలవలేదు.ఇప్పటివరకు ఈ రికార్డు బహామాస్ మాజీ కెప్టెన్ గ్రెగరీ టేలర్ పేరిట ఉంది. టేలర్ వరుసగా ఏడు టాస్‌లు గెలిచాడు. టేలర్ రేర్ రికార్డును ఇప్పుడు శ్రేయస్ అయ్యర్ బద్దలు కొట్టాడు. భారత కెప్టెన్లలో కూడా శ్రేయస్ కొత్త చరిత్ర సృష్టించాడు. ఇప్పటి వరకు టీ20ల్లో వరుసగా అత్యధిక టాస్‌లు గెలిచిన భారత కెప్టెన్‌గా క్రికెట్ దిగ్గజం ఎంఎస్ ధోనీ ఉన్నాడు. ధోనీ 2010 మే నుంచి 2012 ఫిబ్రవరి మధ్య వరుసగా ఏడు టాస్‌లు గెలిచి ఈ రికార్డును నెలకొల్పాడు. ఇప్పుడు శ్రేయస్ వరుసగా ఎనిమిది టాస్‌లు గెలిచి ధోనీ రికార్డును బ్రేక్ చేశాడు. విరాట్ కోహ్లీ వరుసగా ఆరు టాస్‌లు గెలిచాడు.మరోవైపు పూర్తి సభ్యత్వ దేశాల్లో అత్యధికసార్లు టాస్ గెలిచిన కెప్టెన్ల జాబితాలో వెస్టిండీస్ మాజీ కెప్టెన్ డారెన్ సామీ (10) అగ్ర స్థానంలో ఉన్నాడు. పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ ఆఘా (9) రెండో స్థానంలో ఉండగా.. శ్రేయస్ అయ్యర్ (8) మూడో స్థానంలో నిలిచాడు. జింబాబ్వే గడ్డపై భారత్ మరో రికార్డును కూడా నమోదు చేసింది. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో విదేశీ గడ్డపై అత్యధిక మంది ఆటగాళ్లకు అరంగేట్రం అవకాశం ఇచ్చిన దేశంగా నిలిచింది. ఇప్పటివరకు 31 మంది భారత ఆటగాళ్లు జింబాబ్వేలో టీ20 అరంగేట్రం చేశారు. జింబాబ్వేతో జరిగిన మొదటి మ్యాచ్‌లో పేసర్ అశోక్ శర్మ కూడా భారత్ తరఫున తొలి టీ20 ఆడాడు.

**టీ20ల్లో వరుసగా అత్యధిక టాస్ గెలిచిన భారత కెప్టెన్లు:**

శ్రేయస్ అయ్యర్ -- 8 (2026)
ఎంఎస్ ధోనీ -- 7 (2010-12)
విరాట్ కోహ్లీ -- 6 (2019)
ఎంఎస్ ధోనీ -- 5 (2007)
రోహిత్ శర్మ -- 5 (2020-22)

# బిజినెస్



## 12.5 శాతం నుంచి 10 శాతానికి తగ్గింపు

అమెరికా ప్రెసిడెంట్ డోనాల్డ్ ట్రంప్ ఆదేశాల మేరకు యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ సెక్షన్ 301 కింద ప్రపంచ వ్యాప్తంగా 60 దేశాలపై కొత్త టారీఫ్ శ్లాబులను ప్రకటించింది. మొదట భారత్‌పై 12.5 శాతం టారిఫ్ విధించాలని భావించినప్పటికీ, కార్మిక విధానాలు , ఉత్పత్తుల నిరోధంపై ఇటీవల జరిపిన చర్చల అనంతరం భారత్‌ను తక్కువ పన్ను ఉన్న 10 శాతం కేటగిరీలోకి మార్చారు. ఇండియాతో పాటు కెనడా, బ్రిటన్, మెక్సికో, ఇండోనేషియా, బంగ్లాదేశ్, పాకిస్తాన్, శ్రీలంక వంటి 17 దేశాలకు 10 శాతం టారిఫ్ వర్తించనుంది.కాగా, వెట్టి చాకిరీ ద్వారా తయారయ్యే వస్తువుల దిగుమతిపై నిషేధం అమలు చేయడం, అమెరికాతో జరిపిన చర్చల ఫలితంగా భారత్‌కు ఈ మినహాయింపు దక్కింది. కానీ, ఈయూ , జపాన్, దక్షిణ కొరియా, తైవాన్ మొదలైన దేశాల ఉత్పత్తులపై 10 శాతం నుంచి 12.5 శాతం వరకు పన్నులు విధించారు. 1974 ట్రేడ్ యాక్ట్‌లోని సెక్షన్ 301 ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా సప్లై చైన్లలో బలవంతపు శ్రమను అరికట్టడమే లక్ష్యంగా యుఎస్ టారిఫ్‌లలో మార్పులు చేసింది.



## భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు..

దేశీయ మార్కెట్‌లో శుక్రవారం బంగారం, వెండి ధరలు భారీగా దిగివచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్లలో హెచ్చుతగ్గులు, బులియన్ మార్కెట్‌లో చోటుచేసుకున్న పరిణామాల కారణంగా పసిడి రేట్లు తగ్గుముఖం పట్టాయి. తాజా సమాచారం ప్రకారం, 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.1,850 తగ్గడంతో రూ.1,44,330కి చేరింది. అలాగే, 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రేటు కూడా రూ.1,700 మేర తగ్గి రూ.1,32,300 వద్ద కొనసాగుతోంది.మరోవైపు, పసిడి బాటలోనే వెండి ధర కూడా తీవ్రంగా పడిపోయింది. కిలో వెండి ధరపై ఏకంగా రూ.5,000 వరకు తగ్గుదల నమోదు కావడంతో తాజా రేటు రూ.2,35,000 స్థాయికి చేరింది. వరుస పెరుగుదలతో ఆందోళన చెందుతున్న కొనుగోలుదారులకు, ముఖ్యంగా శుభకార్యాలు, ఆభరణాల కొనుగోలు ప్లాన్ చేసుకునే వారికి ఈ ధరల తగ్గుదల తీవ్ర ఊరటనిచ్చింది.

# గుడ్ న్యూస్ చెప్పిన ఇన్ఫోసిస్..




దేశంలోని రెండో అతిపెద్ద ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ ఉద్యోగార్థులకు శుభవార్త చెప్పింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగం వేగంగా పెరుగుతున్నప్పటికీ, ఈ ఆర్థిక సంవత్సరంలో 20,000 మంది కొత్త గ్రాడ్యుయేట్లను నియమించనున్నట్లు కంపెనీ ప్రకటించింది. దీంతో క్యాంపస్ ప్లేస్‌మెంట్లు, ఎంట్రీ-లెవల్ ఐటీ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది విద్యార్థులకు ఊరట లభించింది.

**ఏఐ ప్రభావం ఉన్నా నియామకాలు కొనసాగుతాయి**

గత కొన్ని త్రైమాసికాలుగా ఏఐ ఆధారిత టెక్నాలజీల వినియోగం పెరగడంతో ఐటీ రంగంలో నియామకాలు తగ్గాయనే అభి్ర-పాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, ఎంట్రీ-లెవల్ ఉద్యోగాలపై ఏఐ ప్రభావం పరిమితంగానే ఉందని ఇన్ఫోసిస్ స్పష్టం చేసింది. మొదటి త్రైమాసిక ఆర్థిక ఫలితాల సందర్భంగా కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సలీల్ పరేఖ్ మాట్లాడుతూ, ఏఐ వల్ల ఉత్పాదకత పెరిగినప్పటికీ క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌ను కొనసాగిస్తామని తెలిపారు.

**మొదటి త్రైమాసికంలోనే 4,000 మందికి పైగా నియామకాలు**

సలీల్ పరేఖ్ మాట్లాడుతూ, "గత ఆర్థిక సంవత్సరంలో 20,000 మంది గ్రాడ్యుయేట్లను నియమించుకున్నాం. ఈ ఏడాది కూడా అదే స్థాయిలో 20,000 మంది ఫ్రెషర్లను నియమించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే మొదటి త్రైమాసికంలో 4,000 మందికి పైగా కొత్త గ్రాడ్యుయేట్లను నియమించుకున్నాం." అని తెలిపారు.

**ఏఐ సేవలతో రెండంకెల వృద్ధి**

ఇన్ఫోసిస్ తన ఏఐ వ్యూహం ద్వారా మంచి ఫలితాలను సాధిస్తున్నట్లు వెల్లడించింది. ఏఐ ఆధారిత సేవల విభాగంలో కంపెనీ రెండంకెల వృద్ధి నమోదు చేసింది. మొత్తం ఆదాయంలో ఏఐ సంబంధిత సేవల వాటా 8.2 శాతం. ఏఐ వినియోగంతో ఉత్పాదకతలో గణనీయమైన మెరుగుదల. కొత్త టెక్నాలజీలపై పెట్టుబడులు కొనసాగింపు

**ఉద్యోగుల సంఖ్య స్వల్పంగా తగ్గింది**

గత త్రైమాసికంలో ఇన్ఫోసిస్‌లో 532 మంది ఉద్యోగులు తగ్గారు. ప్రస్తుతం కంపెనీలో మొత్తం సుమారు 3.28 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

**లాభం తగ్గినా.. వార్షికంగా వృద్ధి**

జూన్ త్రైమాసికంలో కంపెనీ నికర లాభం త్రైమాసిక ప్రాతిపదికన సుమారు 9 శాతం తగ్గి రూ.7,769 కోట్లకు చేరింది. గత ఎనిమిది త్రైమాసికాల్లో ఇది రెండో అతిపెద్ద త్రైమాసిక తగ్గుదలగా కంపెనీ పేర్కొంది. అయితే, గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఏకీకృత నికర లాభం 12 శాతం పెరిగింది.

**ఆదాయం 14 శాతం పెరుగుదల**

కంపెనీ కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం గత ఏడాదితో పోలిస్తే 14 శాతం పెరిగింది. గత ఏడాది జూన్ త్రై-మాసిక ఆదాయం: రూ.42,279 కోట్లు. ఈ ఏడాది జూన్ త్రైమాసిక ఆదాయం: రూ.48,211 కోట్లు. ఈ గణాంకాలు కంపెనీ వ్యాపార విస్తరణను సూచిస్తున్నాయి.

**ఉద్యోగులకు శుభవార్త**

త్వరలోనే ఉద్యోగుల వేతనాల పెంపు చేపట్టనున్నట్లు ఇన్ఫోసిస్ ప్రకటించింది. అలాగే, భవిష్యత్ వ్యాపార విస్తరణలో భాగంగా హెల్త్‌కేర్, డిజిటల్ సర్వీసులు, ఏఐ ఆధారిత పరిష్కారాలు వంటి రంగాల్లో మరిన్ని అవకాశాలను అన్వేషిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. ఏఐ వినియోగం పెరుగుతున్నప్పటికీ, కొత్త ప్రతిభకు అవకాశాలు కల్పించడంలో ఇన్ఫోసిస్ తన కట్టుబాటును కొనసాగిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో 20,000 మంది ఫ్రెషర్ల నియామకం, జీతాల పెంపు, కొత్త రంగాల్లో విస్తరణ వంటి నిర్ణయాలు కంపెనీ భవిష్యత్ వృద్ధిపై సానుకూల సంకేతాలుగా పరిశ్రమ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# లేడీ ఓరియెంటెడ్ మూవీకి సాయి పల్లవి గ్రీన్ సిగ్నల్..



వైవిధ్యమైన కథలతో ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు తిరుమల కిషోర్.. ఇప్పుడు ఓ లేడీ ఓరియెంటెడ్ మూవీకి సిద్ధం అవుతున్నాడు. ఇది పూర్తి మహిళా ప్రధాన్య కథ మాత్రమే కాకుండా.. ఇందులో దైవిక అంశాలు, పురాణాల టచ్ కూడా ఉంటాయని టాలీవుడ్ వర్గాల నుంచి సమాచారం. అయితే.. ఈ సినిమాలో ప్రధాన పాత్రలో నటించేందుకు సాయిపల్లవిని అప్రోచ్ అయ్యాడట ఈ డైరెక్టర్. ఇప్పటికే ఈ నేచురల్ బ్యూటీకి కథ కూడా చెప్పగా.. కథలోని భావోద్వేగాలు, పాత్రకు ఉన్న ప్రాధాన్యం సాయిపల్లవికి నచ్చడంతో ఆమె కూడా సానుకూలంగా స్పందించిన నట్లు ఫిలిమ్ వర్గాల నుంచి సమాచారం. కథ, పాత్రల విషయంలో ఫుల్ క్లారిటీతో ఉండే సాయిపల్లవి.. ఇప్పుడు ఈ ఓరియెంటెడ్ మూవీకి ఓకే చెప్పిందని ప్రస్తుతం వార్తలు వైరల్ అవుతుండగా.. తిరుమల కిషోర్ సిద్ధం చేసిన ఈ దైవిక కథలో విషయం బలంగా ఉన్నట్టే అని భావిస్తున్నారు. దీంతో ఈ ప్రాజెక్టుపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రాకుండానే నెట్టింట హైప్ క్రియేట్ అవుతుంది. మరి ఈ వార్తల్లో ఎంత వరకు నిజం ఉందో తెలియాల్సి ఉంది.





# తెలుగు, తమిళ్ రిలీజ్ వాయిదా!

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ నటించిన తాజా చిత్రం 'ది ఇండియా స్టోరీ'. ఈ చిత్రం రిలీజ్‌కు ముందే కీలక మార్పు చోటుచేసుకుంది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ సినిమా రేపు (జూలై 24న) థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉండగా, సెన్సార్ ప్రక్రియ పూర్తికాకపోవడంతో తెలుగు, తమిళ భాషల్లో విడుదల నిలిపివేసినట్లు తెలుస్తోంది.

సామాజిక అంశాలను ప్రధానంగా తీసుకుని తెరకెక్కిన ఈ చిత్రంలో వ్యవసాయ రంగంలో పురుగుమందుల వినియోగం వల్ల ప్రజల ఆరోగ్యంపై పడుతున్న ప్రభావాలను మేకర్స్ చూపించనున్నారు. సమాజంలో చర్చకు దారితీసే అంశాన్ని స్టోరీగా ఎంచుకున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్ పవర్‌ఫుల్ లాయర్ పాత్రలో కనిపించనున్నారు. తన కెరీర్‌లో విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటున్న కాజల్‌కు ఈ సినిమా మరో ప్రత్యేకమైన ప్రాజెక్ట్‌గా మారనుందని ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.


బాలీవుడ్ నటుడు శ్రేయాస్ తల్పడే కూడా ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తున్నారు. అయితే డబ్బింగ్ వెర్షన్లకు సంబంధించిన సెన్సార్ కార్యక్రమాలు ఇంకా పూర్తికాకపోవడంతో తెలుగు, తమిళ ప్రేక్షకులు ఈ సినిమాను ప్రస్తుతం అనుకున్న తేదీకి రిలీజ్ కావడం లేని సమాచారం. ప్రస్తుతానికి కేవలం హిందీ వెర్షన్ మాత్రమే అనుకున్న తేదీకి విడుదల కానుందని చిత్ర బృందం నుంచి సమాచారం అందుతోంది. చేతన్ డీకే దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని జీ స్టూడియోస్, ఎంఐజీ ప్రొడక్షన్ అండ్ స్టూడియోస్ సంయుక్తంగా సమర్పిస్తున్నాయి. ఈ సినిమాను సాగర్ బి.షిండే నిర్మించారు. సామాజిక సందేశంతో తెరకెక్కిన 'ది ఇండియా స్టోరీ'కి ప్రేక్షకుల నుంచి ఎలాంటి స్పందన వస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.




# రిలీజ్ డేట్ ఫిక్స్!

'హనుమాన్'తో ఇండియావైడ్‌గా సూపర్ పాపులారిటీ సొంతం సంపాదించుకున్న టాలీవుడ్ ప్రొడక్షన్ హౌజ్ ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రాబోతున్న చిత్రం 'బిల్లా రంగా భాషా'. ఇందులో కన్నడ స్టార్ యాక్టర్ కిచ్చా సుదీప్ ప్రధాన పాత్రలో నటిస్తున్నాడు. ఈ ప్రాజెక్టును 2024లో ప్రకటించినప్పటికీ విడుదలకు మాత్రం నోచుకోలేదు. దీంతో అసలు ఈ సినిమా ఉందా లేదా అనే ఊహాగానాలు వినిపించాయి. ప్రస్తుతం ఈ మూవీకి సంబంధించిన షూటింగ్ జరుగుతుండగా.. తాజాగా విడుదలపై అప్డేట్ వచ్చింది. ఈ చిత్రాన్ని 2027 అక్టోబర్ 27న ఘనంగా థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయట. నిర్మాణ పనులను సజావుగా కొనసాగిస్తూ, 2027 జనవరి నాటికి షూటింగ్ మొత్తాన్ని పూర్తి చేయాలని చిత్ర బృందం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తుండగా.. BRB అభిమానుల కోసం ఆశ్చర్యకరమై న పుట్టినరోజు కౌంట్‌డౌన్ అధికారికంగా మొదలు కాగా.. ఇకపై బ్యాక్ టు బ్యాక్ అప్డేట్స్ ఇవ్వనున్నట్లు మేకర్స్ తెలిపారు. కాగా.. భారతీయ సినిమాల్లో అరుదుగా కనిపించే పోస్ట్ అపోకలిప్టిక్ ప్రపంచాన్ని భారీ విజువల్ స్కేల్‌తో ఆవిష్కరించేందుకు సిద్ధం అవుతున్నారు చిత్ర బృందం.

# స్టార్ట్ అయ్యేది ఎప్పుడంటే?




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, అట్లీ కాంబోలో రాబోతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'రాకా'పై ఇప్పటికే అభిమానులతో పాటు, ప్రేక్షకుల్లో కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రమంలోనే ఈ సినిమాకు సంబంధించి నిత్యం ఏదో ఒక వార్త నెట్టింట చక్కర్లు కొడుతూనే ఉంది. ఇందులో భాగంగా తాజాగా ఈ సినిమా షూటింగ్‌పై లేటెస్ట్ అప్డేట్ వచ్చింది. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న రాకా.. ఆగస్టు మొదటి వారంలో తదుపరి షెడ్యూల్ షూటింగ్‌ను తిరిగి ప్రారంభించడానికి అల్లు అర్జున్ సిద్ధవవుతున్నారట. ఈ ఏడాది చివరి నాటికి షూటింగ్ మొత్తాన్ని పూర్తి చేయాలని చిత్ర బృందం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం ఈ అప్డేట్‌కు సంబంధించిన వార్తలు వైరల్ అవుతుండగా.. అల్లు అర్జున్ ఫ్యాన్స్ ఖుష్ అవుతున్నారు. కాగా.. ఈ చిత్రంలో అల్లు అర్జున్ సరసన దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తున్నారు.

# మంచి పాత్ర వస్తే అప్పుడు ఆలోచిస్తా..




జబర్దస్త్ ఫేమ్ అదిరే అభి (అభినయ కృష్ణ) దర్శకత్వంలో తెరకెక్కిన లేటెస్ట్ మూవీ 'కర్మాఖ్య'. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం నుంచి తాజాగా ట్రైలర్ విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఒకప్పుడు స్టార్ హీరోయిన్, ప్రస్తుత రాజకీయ నేత విజయశాంతి ఆసక్తిక కామెంట్స్ చేశారు. 'పెద్ద సినిమాలతో పోలిస్తే చిన్న చిత్రాలకు లభించే మద్దతు కాస్త తక్కువే అయినప్పటికీ, నిజమైన దమ్ము, కొత్తదనం, బలమైన కథలు చిన్న సినిమాల్లోనే ఉంటాయి. ప్రేక్షకులు ఇలాంటి వైవిధ్యమైన ప్రయత్నాలను ఆదరిస్తే పరిశ్రమకు మరింత మంది కొత్త నటీనటులు, దర్శకులు వస్తారు. ముఖ్యంగా చిన్న సినిమా నిర్మాతలు నిలదొక్కుకోవాలంటే మీడియా సహకారం చాలా అవసరం. కొత్త కథలను ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్లడంలో మీడియానే కీలక పాత్ర పోషిస్తుంది' అని తెలిపారు. అలాగే.. ఆమె నటన కెరీర్‌పై స్పందిస్తూ.. 'ప్రస్తుతం నేను రాజకీయాల్లో బిజీగా ఉన్నందున నటించే ఆలోచన లేదు. అయితే బలమైన కథ, గుర్తుండిపోయే మంచి పాత్ర వస్తే మాత్రం ఆలోచిస్తాను' అని చెప్పుకొచ్చారు. కాగా.. కర్మాఖ్య చిత్రం జులై 31న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నది.

# నా హృదయం ముక్కలైంది..




నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా దేశ రాజధాని ఢిల్లీ వేదికగా విద్యార్థులు చేస్తున్న ఉద్యమానికి రోజు రోజుకు మద్దతు పెరుగుతోంది. ఈ క్రమంలోనే తాజాగా ఈ ఉద్యమానికి తన మద్దతును తెలుపుతూ సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ షేర్ చేసింది బాలీవుడ్ నటి ఆలియా భట్. 'గత కొద్ది రోజులుగా జరుగుతున్న పరిణామాలతో నా హృదయం ముక్కలైంది.. అదే సమయంలో విద్యార్థులు చూపిస్తున్న ధైర్యం మళ్లీ ఆశను కలిగించింది. ప్రతి విద్యార్థి వెనుక కుటుంబం కలలు, ఎన్నో త్యాగాలు, భవిష్యత్తుపై ఆశలు దాగి ఉంటాయి' అంటూ భావోద్వేగ నోట్ షేర్ చేసిన ఆలియా.. దేశ భవిష్యత్తును నిర్మించబోయే యువత గొంతును వినాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది.. 'జై హింద్.. విద్యార్థుల కోసం.. విద్యార్థుల చేత' అంటూ అన అభిప్రాయాన్ని పంచుకుంది.

# ఫస్ట్ సింగిల్ రిలీజ్ డేట్ ఫిక్స్?




కోలీవుడ్ నటుడు ధనుష్ ప్రస్తుతం 'అమరన్' ఫేమ్ రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఓమ్ - ఛాప్టర్ 1: ఉదిరమ్' చిత్రంలో ప్రధాన పాత్రలో నటిస్తున్నాడు. ఈ సినిమాను ఈ ఏడాది అక్టోబర్ 16న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో చిత్ర బృందం షూటింగ్‌ను శరవేగంగా పూర్తి చేస్తోంది. ఇదిలా ఉండగా, ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం వినిపిస్తున్న వార్తల ప్రకారం, జూలై 28న ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేయాలని చిత్ర బృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన కూడా మరికొద్ది రోజుల్లో వెలువడే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రంలో మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి, సాయి పల్లవి, శ్రీలీల, నసీరుద్దీన్ షా తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తుండగా, ఆర్‌టేక్ స్టూడియోస్, వండర్‌బార్ ఫిల్మ్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**